ఎవరికీ పట్టదా..?

మున్సిపాలిటీ స్థలంలో వరి సాగు

యథేచ్ఛగా రిజర్వుడ్ స్థలం ఆక్రమణ

వైసీపీ నాయకుడి నిర్వాకాన్ని పట్టించుకోని అధికారులు



మున్సిపాలిటీ రిజర్వుడ్ స్థలంలో వరిపంట సాగు చేసిన వైసీపీ నాయకుడు

ధర్మవరం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): పేదల ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం కేటాయించిన లేఅవుట్‌లోని 50 సెంట్ల స్థలాన్ని వైసీపీ నాయకుడు ఆక్రమించేశాడు. అందులో వరి పంట సాగు చేశాడు. 2018లో రాష్ట్ర ప్రభుత్వం పేదల ఇళ్ల పట్టాల కోసం దాదాపు 100 ఎకరాల భూమి సేకరించింది. ఆ తరువాత పోతులనాగేపల్లి లే అవుట్‌లోని 28, 29, 33 సర్వేనెంబర్లలో దాదాపు 73 ఎకరాలలో 2020 డిసెంబరులో పేదలకు 2263 పట్టాలు పంపిణీ చేశారు. ఇప్పటికే 1800 దాకా ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. అదే విధంగా ఆ సర్వేనెంబర్లలో రోడ్డు పక్కన పార్క్, గుడి, బడి, కమ్యూనిటీ హాల్ తదితర వాటికి రిజర్వుడు స్థలాన్ని కూడా అధికారులు కేటాయించారు. అయితే వైసీపీకి చెందిన ఓ నాయకుడు అభివృద్ధి కార్యక్రమాల కోసం కేటాయించిన స్థలాన్ని ఆక్రమించి, వరిపంట సాగు చేశాడు. జిల్లా కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారి పక్కనే మున్సిపల్ స్థలంలో వరిపంటసాగు చేస్తే మున్సిపల్ అధికారులు మాత్రం ఏమిపట్టనట్లు వ్యవహరిస్తుండటంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. పోతులనాగేపల్లి లేఅవుట్లలో మున్సిపాలిటీకి సంబంధించిన స్థలం ఎంత ఉందో కూడా అధికారులకు తెలియకపోవడం గమనార్హం. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్‌ను వివరణ కోరగా ఆ విషయాన్ని టౌన్‌ప్లానింగ్ అధికారిని అడగాలని తప్పించుకున్నాడు. టౌన్‌ప్లానింగ్ అధికారి అలివేలమ్మను వివరణ కోరగా పోతులనాగేపల్లి లే అవుట్‌ను పరిశీలించామన్నారు. వరి పంట సాగు చేసిన స్థలం సర్వీసు రోడ్డు అన్నారు. ఆ రోడ్డు పక్కన ఉన్న 24 సెంట్లలో రెవెన్యూ అధికారులు ఇళ్లపట్టాలు ఇచ్చారని పంటసాగు చేసిన వారు చెబుతున్నారని తెలిపారు. వాటి పక్కనే మరో ఐదు సెంట్ల ఓపెన్‌సైట్ మున్సిపాలిటీకి ఉందన్నారు. ఈ విషయంపై తహసీల్దార్ సురేశ్‌బాబును వివరణ కోరగా పోతులనాగేపల్లి రిజర్వుడు స్థలంలో వరి పంట సాగు చేయడం, ఆ స్థలం ఎవరికి ఇచ్చారన్న విషయాన్ని రికార్డు పరంగా పరిశీలించి, రిజర్వుడు స్థలంలో వరి పంట ఉంటే ఉన్నతాధికారులకు తెలియజేసి, చర్యలు తీసుకుంటామన్నారు.



మున్సిపాలిటీ స్కెచ్‌లో రిజర్వుడు స్థలం

జలకళ..!



బుడ్డారెడ్డిపల్లి వద్ద నిండిన ఫాంపాండ్

కూటమి ప్రభుత్వం రాగానే రూ.2 కోట్లతో పనులు

విరివిగా చెక్‌డ్యాంలు, ఫాంపాండ్ల తవ్వకాలు

వర్షాలకు నిండిన చెక్‌డ్యాంలు, కుంటలు

బోరు బావుల్లో పెరిగిన భూగర్భ జలాలు



బుడ్డారెడ్డిపల్లి వద్ద నిండిన చెక్ డ్యాం

ధర్మవరం రూరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలతో గ్రామీణ ప్రాంతాల్లో జలకళ సంతరించుకుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా వాటర్‌షెడ్ ప్రాజెక్టు పథకం కింద నిర్మించిన చెక్‌డ్యాంలు, కుంటలు నీటితో కళకళలాడుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గ్రామాల్లో వాటర్‌షెడ్ పనులు ఊపందుకున్నాయి. కొండ ప్రాంతాల్లో చెక్‌డ్యాంలు నిర్మించడంతో ప్రస్తుతం కురిసిన వర్షాలకు నీరుచేరి పొంగిపొర్లాయి. పంటపొలాల్లో ఫాంపాం డ్లు, కుంటలు తవ్వించారు. భూగర్భజలాలు పెరిగేందుకు దోహదపడే పనులు చేపట్టారు. ధర్మవరం మండలం ఏలుకుంట్ల, బుడ్డారెడ్డిపల్లి, తనకంటివారిపల్లి, నేలకోట, నేలకోట తండా (మిగతా 6లో...)



బుడ్డారెడ్డిపల్లి వద్ద బోరులో పెరిగిన భూగర్భ జలాలు

పంటల సాగుకు నీటి కొరత లేదు



మా గ్రామం చుట్టూ ఫాంపాండ్లు, కుంటలు తవ్వడంతో వర్షపునీరు చేరి కళకళలాడుతున్నాయి. దీంతో బోర్లలో భూగర్భ జలాలు పెరిగాయి. పంటల సాగుకు నీటి కొరత లేకపోవడంతో ఆనందంగా ఉంది. వాటర్ షెడ్ పనులతో ఎంతో ప్రయోజకరంగా ఉంది. మా పొలంలో ఫాంపాండ్ తవ్వించాను. బోర్లలో నీరు బాగా రావడంతో మామిడి సాగుచేశాను.

- మోపూరి రామ్మోహన్, రైతు, ఏలుకుంట్ల

ఎరువుల అక్రమ రవాణాని అరికట్టాలి: కలెక్టర్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పుట్టపర్తి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వ్యవసాయ అవసరాలకు కాకుండా వేరే అవసరాలకు ఎరువులను వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చేతన్ అధికారులను ఆదేశించారు. ఎరువు పట్టించుకునే వారే కరువు శీర్షికతో ఆంధ్రజ్యోతి దినపత్రికలో శుక్రవారం కథనం ప్రచురితమైన విషయం విదితమే. ఈ వార్తకు స్పందించిన కలెక్టర్ శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి జిల్లాలోని ఆర్డీఓలు, వ్యవసాయాధికారులతో ఎరువుల కరువుపై సమీక్షించారు. ఎరువుల అక్రమ రవాణాను అధికారులు పూర్తిగా అరికట్టాలన్నారు. అక్రమంగా పక్కరాష్ట్రాలకు తరలించకుండా నిరంతరం నిఘా ఉంచాలన్నారు. సంబంధిత అధికారులు ఎరువుల దుకాణాలను తనిఖీ చేయాలన్నారు. పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ కొత్తచెరువు మండల కేంద్రంలో పలు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు.

డీఎస్సీ మెరిట్ లిస్టు వచ్చేసిందోచ్..

● డీఎస్సీ, విద్యాశాఖ వెబ్‌సైట్లలో జాబితా ● డీఎస్సీ లాగిన్ ఐడీల ద్వారా అభ్యర్థులకు కాల్‌లెటర్లు

అనంతపురం విద్య, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ మెరిట్ లిస్టును రాష్ట్ర విద్యాశాఖ శుక్రవారం రాత్రి విడుదల చేసింది. మెగా డీఎస్సీ, విద్యాశాఖ వెబ్‌సైట్లలో జాబితాలను ఉంచినట్లు డీఈఓ ప్రసాద్‌బాబు వెల్లడించారు. జిల్లాలో 807 టీచర్ పోస్టులకు సంబంధించిన సమాచారంతోపాటు జోనల్‌స్థాయి మోడల్ స్కూళ్ల పీజీటీ, టీజీటీ పోస్టులకు సంబంధించిన వివరాలు ఉన్నాయన్నారు. కేటగిరీ పోస్టులకు సంబంధించి జోన్ ఆఫ్ కన్సర్మేషన్‌లోకి వచ్చిన అభ్యర్థులకు వ్యక్తిగత మెగా డీఎస్సీ లాగిన్ ఐడీల ద్వారా కాల్‌లెటర్లు పంపనున్నట్లు రాష్ట్రఅధికారులు తెలిపారని డీఈఓ వెల్లడించారు. అపుడు అభ్యర్థులు వ్యక్తిగత లాగిన్‌ద్వారా కాల్‌లెటర్లు డౌన్‌లోడ్ చేసుకుని, అందులో కనబరచిన మేరకు నిబంధనలు పాటించాల్సి ఉంటుందన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు ఇటీవల జారీచేసిన కుల ధృవీకరణ పత్రం, గెజిటెడ్ అధికారితో ధ్రువీకరించుకుని, మూడుసెట్ల జిరాక్స్ కాపీలు, 5 ఫొటోలతో సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరుకావాల్సి ఉంటుందని డీఈఓ తెలిపారు. అంతకుముందే సర్టిఫికెట్లను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు.

గొడవ గొడవ..!

హుసేన్‌పురంలో వైసీపీ, టీడీపీ వర్గీయుల ఘర్షణ

ఎంపీపీ పురుషోత్తం రెడ్డి, టీడీపీ నాయకుడు బాబురెడ్డికి గాయాలు

పరస్పరం ఫిర్యాదులు.. కేసులు నమోదు





ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న టీడీపీ నాయకుడు బాబురెడ్డి, మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

చిలమత్తూరు/హిందూపురం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుడు, చిలమత్తూరు ఎంపీపీ పురుషోత్తం రెడ్డి, టీడీపీ నాయకుడు బాబురెడ్డి వర్గాల మధ్య శుక్రవారం ఘర్షణ చోటుచేసుకుంది. ఎంపీపీ స్వగ్రామం హుసేన్‌పురంలో ఈ ఘర్షణ చోటుచేసుకుంది. ఎంపీపీ కవ్వింపు చర్యలకు పాల్పడి దాడి చేశారని బాబురెడ్డి వర్గీయులు ఆరోపించారు. గుడికి వెళ్లి ఇంటికి వస్తుండగా దారి కాచి తనపై బాబురెడ్డి, అతని వర్గీయులు దాడిచేశారని ఎంపీపీ ఆరోపించారు. ఈ ఘర్షణలో ఎంపీపీ, బాబురెడ్డి ఇద్దరూ గాయపడ్డారు. చికిత్స కోసం ఎంపీపీ హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లారు. బాబురెడ్డి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించుకుని, మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకి వెళ్లారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేశామని చిలమత్తూరు ఎస్‌ఐ మునీర్ అహమ్మద్ తెలిపారు. కొన్నేళ్లుగా రెండు వర్గాల మధ్య కొనసాగుతున్న పాత కక్షల కారణంగానే ఈ గొడవ జరిగిందని సమాచారం. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ రోజున బాబురెడ్డిపై వైసీపీ నాయకులు దాడికి పాల్పడ్డారు. ఆ దాడిలో బాబురెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు.

రోడ్డుపై బైఠాయింపు

ఎంపీపీని వైసీపీ హిందూపురం నియోజకవర్గ ఇన్‌చార్జి దీపిక, నాయకులు వేణురెడ్డి తదితరులు ఆసుపత్రిలో పరామర్శించారు. అనంతరం రోడ్డుపైకి వచ్చి బైఠాయించారు. వారిని వన్‌టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కి తరలించారు. 30 యాక్టును ఉల్లంఘించినందుకు

(మిగతా 6లో..)

ఖాద్రీ ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతం



అలంకరణలో అమ్మవారు

కదిరి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శ్రావణమాసం చివరి శుక్రవారం సందర్భంగా సామూహిక వరలక్ష్మీవ్రతాలు నిర్వహించారు. ఆలయంలోని కల్యాణ వేదిక వద్ద అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి, వరలక్ష్మీవ్రతాలు చేశారు. మహిళలకు ఆలయం తరఫున వ్రతసామగ్రి పంపిణీ చేశారు. ప్రధాన అర్చకుడు పార్థసారధి ఆచార్యులు.. వ్రత విధానాన్ని వివరిస్తుండగా.. మహిళలు ఆచరించారు. 250మందికిపైగా మహిళలు పాల్గొన్నారు. అనంతరం స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.



వరలక్ష్మీ వ్రతం ఆచరిస్తున్న మహిళలు

వీణలవిందు..

పుట్టపర్తి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): సత్యసాయి విద్యార్థులు వీణావాయిద్యంతో భక్తులను మైమరపింపజేశారు. ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభామండపంలో హయ్యర్ సెకండరీ విద్యార్థులు శుక్రవారం వీణ, తబలా వాయిద్యంతో కచేరీ నిర్వహించారు. గంటపాటు భక్తులను మైమరపింపజేశారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.



కచేరి నిర్వహిస్తున్న విద్యార్థులు

కదిరిలో గంజాయి ముఠా అరెస్టు

(వివరాలు 7లో..)

అంతా.. గుట్టుగా..

డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియలో జాగ్రత్తలు

సమాచారం బయటకు పొక్కకుండా చర్యలు

25న వెరిఫికేషన్‌కు ఏర్పాట్లు

బీజేపీ రాష్ట్ర కమిటీలో ఉమ్మడి జిల్లా నాయకులకు పదవులు

వైసీపీ అక్రమాలపై 6 విజిలెన్స్..

లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలి: కలెక్టర్



వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షిస్తున్న కలెక్టర్ చేతన్

పుట్టపర్తి టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సంబంధిత అధికారులు సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ చేతన్ ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శుక్రవారం ఆయన స్వచ్ఛాంధ్రా, స్వర్ణాంధ్రా, అన్నదాత సుఖీభవా, ఈక్రాప్ నమోదు, జీఎస్‌డబ్ల్యుఎస్, ఎలక్షన్ ఫారం 6,7, 8, సిబ్బంది బయోమెట్రిక్ హాజరు తదితర అంశాలపై జిల్లాలోని ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, మండల, నియోజకవర్గ ప్రత్యేకాధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మండల వ్యసాయాధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించడానికి క్షేత్రస్థాయిలో పర్యటించి, సకాలంలో వాటిని పూర్తి చేయాలన్నారు. ఈక్రాప్ నమోదుకు సంబంధించి ఈకేవైసీ పెండింగ్ లేకుండా వీఆర్‌ఓలు క్షేత్రస్థాయిలో పరిశీలించి పూర్తి చేయాలన్నారు. జిల్లాలోని ప్రతి ఇంటి నుంచి చెత్తను సక్రమంగా సేకరించాలని ఆదేశించారు. దీనిపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేకదృష్టి సారించాలన్నారు. ప్రస్తుత వర్షాకాలం దృష్ట్యా గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులు నిరంతరం చేపట్టాలన్నారు. ప్రతి 15 రోజులకు ఒకసారి ఓవర్ హెడ్ ట్యాంక్‌లను శుభ్రం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సిబ్బంది బయోమెట్రిక్ హాజరు పెంచాలన్నారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్‌కుమార్, ఇన్‌చార్జి వీఆర్‌ఓ సూర్యనారాయణరెడ్డి, డీపీఓ సమత, సీపీఓ విజయ్‌కుమార్, వివిధ శాఖల అధికారులు సిబ్బంది ఉన్నారు.

హంద్రీనీవాతో సీమ రైతుల కలలు సాకారం

● మంత్రి సత్యకుమార్ యాదవ్



సానేవారిపల్లి చెరువుకు నీటిని విడుదల చేస్తున్న మంత్రి సత్యకుమార్

ముదిగుబ్బ, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవాతో రాయలసీమ రైతుల కలల సాకారమవుతున్నాయని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. మండలంలోని ఎనుములవారి పల్లి సమీపంలో హంద్రీనీవా ప్రాజెక్ట్ ఫేజ్-2 ప్రధాన కాలువ వద్ద నీటి విడుదల సందర్భంగా నిర్వహించిన జలహారతి కార్యక్రమంలో మంత్రి శుక్రవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లా ప్రజల సాగు, తాగునీటి అవసరం తీర్చడంలో హెచ్ఎన్ఎస్ఎస్ ప్రాజెక్ట్ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. రాయలసీమలోని ఏడు జిల్లాలు నంద్యాల, కర్నూలు, అనంతపురం, శ్రీసత్యసాయి, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతిలోని సుమారు 6.025 లక్షల ఎకరాలకు సాగునీటితో పాటు 33 లక్షల మందికి తాగునీరు అందిస్తూ ఈ ప్రాజెక్ట్ ప్రాంతీయ అభివృద్ధికి తోడ్పాటు అందిస్తోందని తెలిపారు. ముదిగుబ్బ సమీపంలో నిర్మాణంలో ఉన్న జిల్లేడు బండ రిజర్వాయర్ ద్వారా ముదిగుబ్బ, బత్తలపల్లి, తాడిమర్రి, ధర్మవరం మండలాల్లోని 23,000 ఎకరాలకు సాగునీరు అందిస్తామన్నారు. గ్రామాలకు తాగునీరు, పరిశ్రమల అవసరాల కోసం 0.338 టీఎంసీల నీరు కూడా సరఫరా చేస్తామన్నారు. రిజర్వాయర్ నిర్మాణానికి రూ.680 కోట్లు అంచనా వ్యయం ఉండగా, ఇప్పటి వరకు రూ.165 కోట్ల పనులు పూర్తయ్యాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

25న టీడీపీ సర్వసభ్య సమావేశం

పుట్టపర్తి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఈనెల25న హిందూపురం టీడీపీ పార్లమెంట్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నారు. పార్లమెంట్ కమిటీల ప్రతిపాదనల పరిశీలకులుగా మంత్రి టీజీ భరత్, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరావు, మారెడ్డి శ్రీనివాసరెడ్డిలు రానున్నారు. జిల్లా కేంద్రం పుట్టపర్తి టీడీపీ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు టీడీపీ జిల్లా అధ్యక్షులు కొల్లకుంట అంజినప్ప, తెలిపారు.

సిద్దేశ్వరుడి దర్శనం.. అదృష్టం


సినీ నటుడు మంచు మనోజ్

అమరాపురం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): హేమావతిలో మానవాకృతిలో సిద్దేశ్వరున్ని దర్శించుకోవడం చాలా అదృష్టమని సినీనటుడు మంచు మనోజ్ పేర్కొన్నారు. మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన హేమావతి సిద్దేశ్వరస్వామి ఆలయాన్ని ఆయన తన భార్య భూమా మౌనికరెడ్డి, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, ఉమాదేవి దంపతులతో కలిసి శుక్రవారం సందర్శించారు. వారికి హేమావతి పంచాయతీ టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం మనోజ్ దంపతులు దేవాలయంలో విశేష పూజలు నిర్వహించారు. భైరవీశ్వరుడు, దొడ్డేశ్వరుడు దేవాలయాలను కూడా సందర్శించారు. దేవాలయ విశిష్టతను ఆలయ అర్చకులు వివరించారు. ఈఓ నరసింహరాజు, ఆలయ కమిటీ చైర్మన్ కరేగౌడ్, టీడీపీ నాయకులు కుమారస్వామి, రామచంద్రప్ప, జయకుమార్, తిప్పజ్జ, కృష్ణమూర్తి, ఓంకారస్వామి, శివకుమార్, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.



సిద్దేశ్వర స్వామి సన్నిధిలో మంచు మనోజ్, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు దంపతులు

చీనీ టన్ను రూ.18వేలు



అనంతపురంరూరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.18వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.9వేలు, సరాసరి ధర రూ.13వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 1094 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

మనీమంతుడు...!

విధి నిర్వహణలో ఆయన స్టైలే వేరు

- జిల్లా కేంద్రంలో ఉంటూనే 'సెటిల్మెంట్లు'
- చుట్టపుచూపుగా కంబదూరుకు రాక
- పైసలిస్తే ఏపనైనా క్షణాల్లో పూర్తి
- ఎంపీడీఓ ఆఫీసులో ఓ అధికారి తీరుపై విమర్శలు



కంబదూరు మండల పరిషత్తు కార్యాలయంలో కనిపిస్తున్న ఖాళీ కుర్చీలు

కళ్యాణదుర్గం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): కంబదూరు ఎంపీడీఓ కార్యాలయంలో పని చేసే ఓ అధికారి స్టైలే వేరు. మ(ప)ని మంతుడిగా పేరు గడించి, తనను ప్రశ్నించే వారు లేరన్న ధైర్యంతో ఆడిందే ఆట.. పాడిందే పాటగా విధులు నిర్వహిస్తున్నాడు. జిల్లా కేంద్రంలో నివాసం ఉంటూ వారానికి ఒకటి , రెండు రోజులు మాత్రమే విధులకు చుట్టపుచూపుగా వస్తున్నారు. మిగతా రోజుల్లో అనంతపురంలోనే ఉంటూ అక్కడే అన్ని సెటిల్మెంట్లు నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు భారీగా ఉంటున్నాయి. ఆ అధికారితో పని ఉన్న వారు ఎప్పుడు ఫోన్ చేసినా 'అనంతపురంలో మీటింగులో ఉన్నా, మళ్లీ ఫోన్ చేస్తా' అని సమాధానం ఇస్తున్నారు. మళ్లీ ఆయన ఫోన్ చేస్తారేమోనని ఎదురుచూడటం అమాయక ప్రజల వంతైంది.

డబ్బులిస్తే ఏ పనైనా..!

డబ్బులిస్తే ఆ అధికారి ఏపనైనా క్షణంలో చేసేస్తాడన్న పేరుగడించా డు. ముఖ్యంగా సర్పంచులతో కుమ్మక్కై నిధులన్నీ పక్కదారి పట్టించడంలో వారికి దారి చూపినట్లు ఆయనపై ఆరోపణలు ఉన్నాయి. వైసీపీ సర్పంచులు, ఎంపీటీసీల సభ్యులతో ఆ అధికారి కలిసిపోయి, వారి పనులు చక్కబెడుతూ, తన పేరు బయట పెట్టవద్దని చెబుతూ డబ్బులను తీసుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ కార్యాలయంలో ఏ పని జరగాలన్నా సొమ్ములివ్వాల్సిందే అనే ప్రచారం సాగుతోంది. ఆ అధికారి తన విధులకు సంబంధించిన కంప్యూటర్, రికార్డులన్నీ కూడా అనంతపురంలో పెట్టుకుని అక్కడి నుంచే కార్యకలాపాలు సాగిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కంబదూరు మండల పరిషత్తు కార్యాలయంలో గతంలో పని చేసిన ఓ అవినీతి అధికారి, ఇక్కడ పనిచేసే ప్రస్తుత అధికారి ఇద్దరూ మిలాఖత్ అయ్యారు. ఎక్కడెక్కడ ఏ పనులు చేయాలో, ఎలా నిధులను స్వాహా చేయాలో ప్రణాళికలు వేసుకుని ముందుకు సాగుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆ అధికారి అవినీతికి అడ్డుకట్ట వేసే వారే కరువ య్యారు. ఉన్నతాధికారులకు తెలిసినా ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఆ అవినీతి అధికారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అంతా ఆయన చెప్పినట్లే..

ఏ ఉన్నతాధికారి కంబదూరు ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చినా, తనమాటలు, చేష్టలతో అతడిని బుట్టవేసుకుని వారు తాను చెప్పినట్లు వినేలా చేసుకుంటాడు. మంచి పని మంతుడిగా పేరు ఉండటంతో అధికారులు కూడా ఆయన చెప్పినట్లు చేస్తుంటారు. ఈ సానుకూలతల తో ఆయన కార్యాలయానికి చుట్టుపుచూపుగా వస్తున్నట్లు సమాచారం. ఆఫీసులో ఎప్పుడు చూసినా ఆయన కుర్చీ ఖాళీగానే కనిపిస్తుంది. ఆయన ఆఫీసుకు ఎప్పుడు వస్తారో అక్కడి సిబ్బందికి కూడా తెలియని పరిస్థితి. ఆయనతో పని ఉన్నవారు మాత్రం అనంతపురం వెళ్లాల్సిందే.

వారంలో రెండు రోజులు నిజమే: సూర్యనారాయణ, ఎంపీడీవో, కంబదూరు

కంబదూరు మండల పరిషత్ కార్యాలయంలో పనిచేసే ఓ అధికారి వారంలో రెండు లేదా మూడు రోజులు మాత్రమే విధులకు హాజరవుతున్న మాట వాస్తవమే. ఆ అధికారి వద్ద పనులు జరగాలంటే డబ్బులు ఇవ్వాలనే విషయం మా దృష్టికి రాలేదు. తాము డబ్బులిచ్చినట్లు ఎవరైనా ఫిర్యాదు చేస్తే ఆ అధికారిపై తప్పకుండా చర్యలు తీసుకుంటాం.

బీజేపీ రాష్ట్ర కమిటీలో ఉమ్మడి జిల్లాకు

పదవులు



కె చిరంజీవిరెడ్డి



కాపు రామచంద్రారెడ్డి



సందిరెడ్డి శ్రీనివాసులు



గుడిసె దేవానంద్

అనంతపురం క్లాక్‌టవర్/పుట్టపర్తి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర కమిటీలో ఉమ్మడి జిల్లాకు కీలక పదవులు దక్కాయి. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ శుక్రవారం రాష్ట్ర కార్యవర్గాన్ని ప్రకటించారు. ఇందులో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా రాయదుర్గం మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి, కదిరికి చెందిన గుడిసె దేవానంద్, కార్యదర్శిగా సందిరెడ్డి శ్రీనివాసులు, విభాగాల రాష్ట్ర కన్వీనర్‌గా కె చిరంజీవిరెడ్డిలను నియమించారు. తమకు నూతన కార్యవర్గంలో స్థానం కల్పించిన అధినాయకత్వానికి వారు ధన్యవాదాలు తెలిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్, ప్రధాన కార్యదర్శులు అశోక్‌రెడ్డి, ఆంజనేయులు, కార్యదర్శి డాక్టర్ పోగుల నాగేంద్రబాబులు రాష్ట్ర కమిటీకి ఎంపికైన నాయకులకు శుభాకాంక్షలు తెలిపారు.

వైసీపీ అక్రమాలపై

విజిలెన్స్..

అనంత నగర పాలక సంస్థలో కలకలం



డంపింగ్‌యార్డు

గత ఐదేళ్లలో చేసిన పనులు, బిల్లులపై విచారణ

అప్పటి అధికారులు, వైసీపీ నాయకుల్లో అలజడి

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ హయాంలో నగర పాలక సంస్థలో అప్పటి అధికారులు, పాలకులు ఆడిందే ఆటగా సాగిందన్నది బహిరంగ రహస్యమే. దోచుకోవడం, జేబు నింపుకోవడమే లక్ష్యంగా వ్యవహారాలు సాగాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. బ్లీచింగ్ చల్లకనే చల్లినట్లు, పనిముట్లు కొనుగోలు చేయకనే రూ.లక్షలాది రూపాయల బిల్లులు చేసుకుని ఇష్టారాజ్యంగా నిధులను జేబుల్లోకి వేసేసుకున్నారు. ఇలా.. కోట్ల రూపాయలు స్వాహా చేశారు. ప్రజాధనాన్ని పక్కదారి పట్టించడంపై విజిలెన్స్ విచారణ చేపట్టింది. దీంతో అప్పటి అధికారులు, వైసీపీ నాయకుల్లో అలజడి మొదలైంది. విజిలెన్స్ అధికారులు కూపీ లాగితే తమ బండారం ఎక్కడ బయటపడుతుందోనని నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. 2019-24 సంవత్సరాల మధ్య కొనుగోలు చేసిన పనిముట్లు, బ్లీచింగ్ పౌడర్, డంపింగ్ యార్డు నిర్వహణ, నగరంలో సుందరీకరణ పనులు, ప్రభుత్వ భూముల ఆక్రమణలు, అక్రమ కట్టడాలు అనే 6 అంశాలపై విచారణ చేస్తున్నారు.



బ్లీచింగ్ పౌడర్

పంచేసుకున్నారు..

ఇబ్బడిముబ్బడిగా తమకు అనుకూలంగా ఉండే కాంట్రాక్టర్లకు పనులు అప్పగించడం రూ.లక్షల్లో కమీషన్లు బొక్కేయడం అప్పట్లో యథేచ్ఛగా సాగింది. వైసీపీ నేతల కనుసన్నల్లోనే ఈ తతంగం నడిచింది. ఇలా నగర పాలక సంస్థలో వైసీపీ ఐదేళ్ల పాలనలో కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని స్వాహా చేశారు. పనిముట్ల కొనుగోలుకు రూ.30లక్షలు, బ్లీచింగ్ పౌడర్‌కి రూ.67లక్షలు, సుందరీకరణకు రూ.6 కోట్లు, డంపింగ్ యార్డు నిర్వహణకు రూ.23 కోట్లు మంజూరు చేయగా.. రూ.12కోట్లు అప్పట్లోనే చెల్లించారు. ఐదేళ్లలో రూ.30కోట్ల వరకు నిధులు దుర్వినియోగమైనట్లు అభియోగాలు నమోదయ్యాయి. అప్పట్లో డీఈఈగా పనిచేసిన ఓ అధికారి తిరిగి ఉద్యోగోన్నతిపై ఇక్కడికి వచ్చారు. గతంలో రూ.కోట్ల అవినీతిలో భాగస్వామి అయిన ఆ అధికారిని తిరిగి ఇక్కడ ఎలా చేర్చుకుంటారనే అంశంపై ఏఎంసీలో జోరుగా చర్చ సాగుతోంది.

పనులు చేయకనే రూ.23కోట్లు స్వాహా

గత వైసీపీ ప్రభుత్వం డంపింగ్ యార్డు పేరుతో కోట్లాది రూపాయల నిధులు మింగేసింది. 2019 ఎన్నికలకు ముందు అప్పటి వైసీపీ అభ్యర్థులు డంపింగ్ యార్డు తరలిస్తామని ప్రగల్భాలు పలికినా ఆ దిశగా ఒక్క అడుగు కూడా వేయలేదు. చెత్త తరలింపు పేరుతో అప్పట్లో రూ.23కోట్ల మేర బిల్లులు చేసుకుని, మెక్కేశారు. చెత్త, మట్టిని అక్రమంగా తరలించిన వైసీపీ ప్రజాప్రతినిధులు కోట్లాది రూపాయల సొమ్మును జేబుల్లోకి వేసుకున్నారు. అప్పట్లోనే ఒకే సమయంలో రూ.12 కోట్ల బిల్లులు చెల్లించారు. ఇదే విషయాన్ని వైసీపీకి చెందిన కార్పొరేటర్లే పలు కౌన్సిల్ సమావేశాల్లో లేవనెత్తడం గమనార్హం. ఈ వ్యవహారాల నేపథ్యంలో విజిలెన్స్ విచారణ అధికారులు, వైసీపీ నేతల్లో అలజడి రేపుతోంది.

విజిలెన్స్ విచారణ నిజమే



మున్సిపల్ కార్పొరేషన్‌లో విజిలెన్స్ విచారణ కొనసాగుతున్న విషయం వాస్తవమే. విజిలెన్స్ అధికారులు అడిగిన అన్ని వివరాలు అందజేస్తున్నాం. విచారణకు సహకరిస్తున్నాం.

- బాలస్వామి,
అనంత నగరపాలక సంస్థ కమిషనర్

అంతా.. గుట్టుగా..!

జాగ్రత్తగా డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

సమాచారం బయటకు పొక్కకుండా చర్యలు

25న ప్రారంభం కానున్న ప్రక్రియ

అనంతపురం విద్య, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ నియామకాల విషయంలో రాష్ట్ర విద్యాశాఖ చాలా జాగ్రత్తలు తీసుకుంటోంది. గతంలో జరిగిన ఘటనలను దృష్టిలో ఉంచుకుని, ప్రతి ప్రక్రియ అత్యంత గోప్యంగా చేపడుతోంది. అందులో భాగంగా ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలనలో జాగ్రత్తలు తీసుకుంటున్నారు. గతంలో కొన్ని కమిటీలు వేసి అర్హత సాధించిన అభ్యర్థులను సర్టిఫికెట్ల పరిశీలనకు పిలిచి చేయించేవారు. ముందుగానే ఏ సబ్జెక్టుకు ఏ టీమ్ సభ్యులు ఉన్నారో తెలిసిపోయేది. అందులో అనుకూలమైన వారితో సర్టిఫికెట్లలో కొన్ని పొరపాట్లు ఉన్నా ఓకే చేయించుకుని వెళ్లేవారనే ఆరోపణలు ఉన్నాయి. నాన్‌లోకల్ వారు లోకల్‌గా చదివినట్లు బోగస్ సర్టిఫికెట్లు పెట్టి ఉద్యోగాలు పొందేవారు. 2008 డీఎస్సీలో ఇలాగే కడప జిల్లాకు చెందిన 30 మందికిపైగా లోకల్‌గా చదివినట్లు సర్టిఫికెట్లు పెట్టి ఉద్యోగాలు పొందగా.. వాటిపై 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలు ప్రచురించడంతో పునఃపరిశీలన చేయించి, ఉద్యోగాల నుంచి తొలగించారు. ఈసారి అలాంటి వాటికి అవకాశం లేకుండా వెరిఫికేషన్‌లో గోప్యత పాటిస్తున్నారు. అభ్యర్థులకు ఎంపికైనట్లు పంపిన మెసేజ్‌లోనే సర్టిఫికెట్ల పరిశీలన తేదీ, కేంద్రం, కమిటీ వివరాలు పంపారు. జిల్లాలో వెరిఫికేషన్‌కు 16 బృందాలను నియమించారు. మెసేజ్‌లో ఇచ్చిన మేరకు ఆయా బృందాల సభ్యుల వద్దకెళ్లి తమ సర్టిఫికెట్లను అభ్యర్థులు వెరిఫికేషన్ చేయించుకోవాల్సి ఉంటుంది. ఆ వెంటనే ఆన్‌లైన్‌లో ఓకే అయిపోతుంది. అందులో సమస్యలు ఉత్పన్నమైతే వెరిఫికేషన్ చేసిన బృందం సభ్యులు బాధ్యత వహించాల్సి ఉం టుంది. సర్టిఫికెట్ల పరిశీలన ఈనెల 25న ఉంటుందని రాష్ట్ర విద్యాశాఖ నుంచి ఆదేశాలు వచ్చాయి. దీంతో జిల్లా విద్యాశాఖ అలుమూరు రోడ్డులో గల పీవీకేకే ఎంబీఏ కళాశాలలో పరిశీలనకు ఏర్పాట్లు చేపట్టింది. డీఈఓ ప్రసాద్ బాబు, ఇతర కమిటీల సభ్యులు, ఐటీ విభాగ సిబ్బంది శుక్రవారం కళాశాలలో ఏర్పాట్లను పరిశీలించారు.



పీవీకేకే కాలేజీలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఈఓ, కమిటీ సభ్యులు

మెరిట్ లిస్టులోనూ ట్విస్టు

గతంలో ముందుగానే మెరిట్‌లిస్టు విడుదల చేసేవారు. ఏ రోస్టర్‌కు, ఎన్ని మార్కులకు పోస్టు వస్తుందో తెలిసిపోయేది. దీంతో కొందరు డీఈఓ కార్యాలయంలో పనిచేసే వారు దళారీలను రంగంలోకి దించి, ఎక్కడ వరకు ఎవరికి పోస్టు వస్తుందో తెలుసుకుని వారితో బేరసారాలు సాగించి జేబులు నింపుకునేవారనే ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలో ఇలాంటి వ్యవహారానికి సంబంధించిన ఆడియో గతంలో బయటపడడంతో ఒకరిని సస్పెండ్ కూడా చేశారు. అందుకే ఈసారి ప్రతి ప్రక్రియను రాష్ట్రశాఖే చేపడుతోంది. ఇప్పటికే మెరిట్ ఆధారంగా అర్హత అభ్యర్థుల ఎంపిక పూర్తి చేశారు. ఆ జాబితాలో కూడా పొరపాట్లకు తావులేకుండా జిల్లాల వారీగా విద్యాశాఖ ఉద్యోగులను రాష్ట్ర కార్యాలయానికి పిలిపించుకుని మెరిట్, రోస్టర్ ఆధారంగా కరెక్టుగా ఉన్నాయో.. లేదో.. పరిశీలించారు. ఆ ప్రక్రియ పూర్తి కావడంతో శుక్రవారం రాత్రి మెరిట్‌లిస్టు విడుదల చేశారు.

గొడవ గొడవ..!

(5వ పేజీ తరువాయి)

వారిపై కేసు నమోదు చేశారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశామని సీఐ రాజగోపాలనాయుడు తెలిపారు.

లోపల వేస్తారు.. అంతేకదా..?



రోడ్డుపై బైఠాయించిన వైసీపీ ఇన్‌చార్జి దీపిక తదితరులు

వైసీపీ నాయకులు ఆందోళనకు సిద్ధమవుతున్నట్లు తెలిసిన పోలీసులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. పురంలోని వైసీపీ నాయకుడు వేణురెడ్డి ఇంటికి వెళ్లారు. నిబంధనలు ఉల్లంఘించవద్దని సూచించారు. దీంతో వేణురెడ్డి పోలీసులతో వాగ్వాదానికి దిగారు. 'టీడీపీ నాయకులు ఏం చేస్తున్నారో చూశారు కదా..? అంతకు మించి మేము ఏమైనా చేస్తే ఏం చేస్తారు..? మహా అయితే లోపల వేస్తారు. అంతే కదా..?' అని మండిపడ్డారు. గతంలో వేణురెడ్డి ఇలాగే వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. వైసీపీ వర్గీయులపై దాడులను సహించబోమని, ఇకపై చెయ్యికి చెయ్యి, తలకు తల అని హెచ్చరించారు. వేణురెడ్డి వ్యాఖ్యలపై టీడీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయనపై పోలీసులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

దాడి హేయమైన చర్య: టీడీపీ

టీడీపీ నాయకుడు బాబురెడ్డిపై ఎంపీపీ పురుషోత్తంరెడ్డి వర్గీయుల దాడి హేయమైన చర్య అని టీడీపీ నాయకులు అన్నారు. టీడీపీ మండల కన్వీనర్ శ్రీనివాసుల ఆధ్వర్యంలో నాయకులు శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. దాడిని తీవ్రంగా ఖండించారు. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ రోజున బాబురెడ్డితో పాటు పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేశారని అన్నారు. ఆ దాడుల్లో బాబురెడ్డి వర్గీయులు తీవ్రంగా గాయపడి, నెలరోజులు కోలుకోలేదని అన్నారు. అప్పటి విధానాన్నే ఎంపీపీ కొనసాగిస్తున్నారని అన్నారు. నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే బాలకృష్ణ అభివృద్ధి చేస్తున్నారని, దాన్ని జీర్ణించుకోలేక వైసీపీ వర్గీయులు దాడులకు పాల్పడుతున్నారని విమర్శించారు. తాము గొడవలకు దూరంగా ఉంటామని, కావాలని రెచ్చగొడితే ఊరుకునే ప్రసక్తే లేదని అన్నారు. సమావేశంలో నాయకులు నాగరాజు యాదవ్, బేకరీ గంగాధర్, గౌరీ శంకర్, లక్ష్మీనారాయణ యాదవ్, విశ్వనాథరెడ్డి, మంజు, చంద్ర, గంగాధర్, వేణు తదితరలు పాల్గొన్నారు.

మహిళా పక్షపాతి సీఎం చంద్రబాబు

స్త్రీనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పరిటాల సునీత



స్త్రీ నిధి చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

కనగానపల్లి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మహిళల పక్షపాతి సీఎం చంద్రబాబు నాయుడు అని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. సంక్షేమ పథకాల్లో మహిళలకే అధిక ప్రాధాన్యత కల్పించారన్నారు. కనగానపల్లి ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఏర్పాటుచేసిన స్త్రీ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పరిటాల సునీత పాల్గొన్నారు. మండలంలోని 513 స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ.4.46 కోట్ల రుణాలకు సంబంధించిన మెగా చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. వంటింటికే పరిమితమైన మహిళలను చైతన్య పరచి కుటుంబాలను స్వశక్తితో పోషించే స్థాయికి తెచ్చింది ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేశారన్నారు. తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఉచిత బస్సు సౌకర్యం కల్పించారన్నారు. త్వరలోనే ఆడబిడ్డ నిధి పథకం ప్రారంభమవుతుందనీ, 50 ఏళ్లకే పింఛన్ అందజేస్తారన్నారు. కార్యక్రమంలో డీపీఎం సత్యనారాయణ, ఏపీఎంలు హనుమేష్, హేమలత, డీసీఎంఎస్, మార్కెట్ యార్డు చైర్మన్లు నెట్టెం వెంకటేష్, సుధాకర్ చౌదరి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

హైడాథాన్-2025లో ఎస్కేయూకు మొదటి బహుమతి

అనంతపురంరూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): హైడాథాన్-2025 పోటీల్లో శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయానికి మొదటి బహుమతి దక్కినట్లు వైస్‌చాన్సలర్ అనిత తెలిపారు. పోటీల్లో పాల్గొని బహుమతి సాధించిన విద్యార్థుల బృందాన్ని ఆమె రిజిస్ట్రార్ రమేష్‌బాబు తో కలిసి శుక్రవారం అభినందించారు. వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం-డీట్ భాగస్వామ్యంతో గుర్తింపు ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ గర్వం అవార్డ్స్ -సీజన్4లో భాగంగా హైడాథాన్-2025 పోటీలను జూన్ 26నుంచి ఆగస్టు 21 వరకు ఐదు దశల్లో నిర్వహించారన్నారు. ఫైనల్ రౌండ్ పోటీలు 21న హైదరాబాదులోని టీ హబ్‌లో జరిగాయన్నారు. ఇందులో వర్సిటీలోని ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల బృందం ఇన్నోవేషన్ ఇంటిగ్రేటెడ్ సొల్యూషన్స్‌లో మొదటి స్థానంలో సాధించినట్లు వెల్లడించారు. దీంతో వారికి రూ.35వేల నగదు బహుమతి దక్కినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర, అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ సీఈఓ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

జలకళ!

(5వ పేజీ తరువాయి)



ఏలుకుంట్ల వద్ద నిండిన కుంట

పరిధిలో వాటర్‌షెడ్ ప్రాజెక్టు పథకం అమలులో ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ గ్రామాల పరిధిలో రూ.2 కోట్ల నిధులతో పనులు చేపట్టారు. చెక్ డ్యాంలు, ఫాంపాండ్లు, కుంటలు, నారవలకు రాతికట్టడాలు తదితర పనులు చేపట్టారు.

పెరిగిన భూగర్భ జలాలు

వాటర్‌షెడ్ పథకంలో చేపట్టిన పనులతో భూగర్భ జలాలు పెరిగాయి. బోరుబావుల్లో సమృద్ధిగా నీరు రావడంతో పంటల సాగుకు అనుకూలంగా ఉందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బుడ్డారెడ్డిపల్లిలో బోరుబావుల నుంచి నీరు ఉబికివస్తోంది. గ్రామాల చుట్టూ కొండలు ఉండటంతో గతంలో నీరు అందుబాటులో లేక పంటలు సాగుచేసుకోలేకపోయామని, ప్రస్తుతం వాటర్‌షెడ్ పథకంలో చేపట్టిన చెక్‌డ్యాంలు, ఫాంపాండ్లు, కుంటలు ఏర్పాటు చేసుకోవడంతో అవి నిండి జలకళను సంతరించుకున్నాయని రైతులు చెబుతున్నారు. బోరుబావుల్లో నీరు పెరగడంతో రైతులు మామిడి, చీనీ, వేరుశనగ, కూరగాయలు పండించుకుంటున్నారు.

వాటర్‌షెడ్ పథకం రైతులకు వరం



వాటర్‌షెడ్ పథకం రైతులకు వరంలాగా నిలుస్తోంది. మా గ్రామంలో ప్రతిరైతు పొలంలో నీరునిల్వ ఉండేందుకు ఫాంపాండ్లు తవ్వించాం. కొండ ప్రాంతాల్లో చెక్‌డ్యాంలు, డకౌట్‌పాండ్లు నిర్మించాం. రైతుల సహకారంతో ఈ పథకాన్ని ముందుకు తీసుకెళుతున్నాం. చెక్‌డ్యాంలు, కుంటలు వర్షపు నీటితో నిండడంతో భూగర్భ జలాలు పెరిగి రైతులు వరి, చీనీ, మామిడి, అరటి పంటలు సాగుచేసుకుంటున్నారు. బోర్లలో నీరు పెరగడంతో రైతులు పనులు చేసుకుంటూ ఆనందంగా ఉన్నారు.

- తిరువీధుల సుధాకర్‌చౌదరి, వాటర్‌షెడ్ చైర్మన్, ఏలుకుంట్ల

భూగర్భ జలాలు పెరిగాయి



గతంలో నీరులేక మా గ్రామంలో కరువుతో అల్లాడేవాళ్లం. వర్షాలు వచ్చినా నీరు నిల్వ ఉండేది కాదు. ఎక్కడికో లోతట్టు ప్రాంతాలకు నీరంతా వెళ్లిపోయేది. దీంతో మా ఊరిచుట్టూ నీరు నిలబడక బోర్లలో నీటి మట్టం తగ్గేది. వాటర్‌షెడ్ పనుల ద్వారా మా గ్రామం చుట్టూ చెక్‌డ్యాంలు, ఇంకుడు గుంతలు తీయడంతో వర్షాలకు నిండాయి. ఆ నీటిని చూసి చాలా ఆనందం వేసింది. భూగర్భ జలాలు పెరిగాయి.

- జయప్రకాష్‌రెడ్డి, రైతు, బుడ్డారెడ్డి పల్లి

ఎంటెక్, ఎం ఫార్మసీ ఫలితాలు విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న డైరెక్టర్ నాగప్రసాద్‌నాయుడు, తదితరులు


అనంతపురంరూరల్,ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూఏ విశ్వవిద్యాలయం పరిధిలో జూలై నెలలో నిర్వహించిన ఎం.టెక్, ఎం.ఫార్మసీ ఫలితాలను శుక్రవారం విడుదల చేశారు. ఎం.టెక్ రెండో సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ, ఎంటెక్ ఒకటి, మూడో సెమిస్టర్ సప్లిమెంటరీ, ఎం ఫార్మసీ రెండో సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ, ఒకటో, మూడో సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ నాగప్రసాద్ నాయుడు తదితరులు విడుదల చేశారు. ఫలితాలు జేఎన్‌టీయూ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఆచార్య శివకుమార్, అడిషినల్ కంట్రోలర్స్ ఆచార్య శంకర్‌శేఖర్‌రాజు, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ అంకారావు పాల్గొన్నారు.

టమోటా కిలో రూ.35

అనంతపురం రూరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో శుక్రవారం కిలో టామోటాలు గరిష్ఠంగా రూ.35తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. కనిష్ఠ ధర రూ.20, సరాసరి ధర రూ.27తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 3,150 టన్నుల టమోటాలు వచ్చినట్లు పేర్కొన్నారు.

భార్య, బిడ్డ లేని జీవితం ఎందుకని..

వృద్ధుడి ఆత్మహత్య


అంజినప్ప (ఫైల్)

గోరంట్ల, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎండాల బండ వీధికి చెందిన బొక్కసం అంజినప్ప (68) శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని వానవోలు రహదారిలో పెట్లగుండపల్లి సమీపంలోని పొలంలో చింతచెట్టుకు ఉరి వేసుకున్నాడు. చెట్టుకు వేలాడుతున్న అంజినప్ప మృతదేహాన్ని పశువుల కాపర్లు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి రెండో కుమారుడు శ్రీనివాసులు (32) అనారోగ్యంతో ఈఏడాది ఫిబ్రవరి 10న ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుమారుడి మృతితో కుంగిపోయిన అంజినప్ప భార్య సాకమ్మ (63) అతడి సమాధి వద్దే మార్చి 10న యాసిడ్ తాగింది. ఆమె బెంగళూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మార్చి 22న మృతి చెందారు. నెల రోజుల వ్యవధిలోనే కుమారుడు, భార్య మృతి చెందడాన్ని అంజినప్ప జీర్ణించుకోలేకపోయాడు. మానసికంగా తీవ్ర వేదనకు గురైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. స్థలం అమ్మి భార్య చికిత్స కోసం చేసిన అప్పులు చెల్లించాడు. కుమారుడు మృతితో వితంతువైన కొడలు పేరున ఇంటిని రాశాడు. అనంతరం ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి పెళ్లైన కుమారుడు ఒకరు, పెళ్లి కావాల్సిన కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక అదృశ్యం


స్వప్న

బొమ్మనహాళ్, ఆగస్టు22, (ఆంధ్రజ్యోతి): బాలిక అదృశ్యంపై బొమ్మనహాళ్ పోలీసుస్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. ఎస్ఐ నబీరసూల్ తెలిపిన మేరకు కర్ణాటక రాష్ట్రంలోని మొలకాల్మూర్ తాలుకా రాంపురం గ్రామానికి చెందిన స్వప్న (14) బొమ్మనహాళ్‌లో నెల రోజుల కిందట తప్పిపోయినట్లు ఆమె తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారన్నారు. రాంపురానికి చెందిన లమ్మని సంతోష్ కుటుంబ సభ్యులతో నెల రోజుల కిందట బొమ్మనహాళ్‌కు కొలిమి పనులకోసం వచ్చారు. గత నెల 23న స్వప్న బహిర్భూమికి వెళ్లి వస్తాను అని చెప్పి తిరిగి రాలేదన్నారు. వివిధ ప్రాంతాల్లో గాలించినా ఆమె ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


శీనప్ప (ఫైల్)

కూడేరు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని శివరాంపేట గ్రామానికి చెందిన రైతు బోయ శీనప్ప(35) అప్పుల బాధతో ఉరి వేసుకున్నాడు. శీనప్పకు రెండెకరాల పొలం ఉంది. దీనికితోడు నాలుగు ఎకరాలను కౌలుకు తీసుకుని కంది, ఆముదం, పప్పుశనగ పంటలను సాగు చేసి నష్టపోయాడు. రూ.5 లక్షలకు పైగా అప్పులు పేరుకు పోయాయి. దిక్కుతోచని స్థితిలో శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. పొలం పనులకు వెళ్లిన భార్య అరుణజ్యోతి తిరిగి వచ్చేసరికి మృతిచెందాడు. ఇరుగుపొరుగు సాయంతో మృతదేహాన్ని కిందకు దించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. రైతు దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు విన్నవించారు.

ప్రేమ పెళ్లికి నిరాకరించారని

యువకుడి ఆత్మహత్య


గుణ(ఫైల్)

బత్తలపల్లి, ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాఘవంపల్లికి చెందిన యువకుడు గుణ (20) ప్రేమ పెళ్లికి బంధువులు నిరాకరించారన్న మనస్తాపంతో శుక్రవారం ఉరేసుకుని, ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ సోమశేఖర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాఘవంపల్లికి చెందిన నరసింహుడికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు గుణ పదో తరగతి వరకు చదివి ఇంటి వద్దే వ్యవసాయం చేసుకుంటుండేవాడు. బంధువుల అమ్మాయిని ప్రేమించాడు. విషయం తెలుసుకున్న అమ్మాయి తల్లిదండ్రులు వారి ప్రేమను అంగీకరించలేదు. దీంతో గుణ మనస్తాపం చెందాడు. తోటలోనే వారి ఇల్లు ఉండేది. శుక్రవారం రాత్రి ఇంటి ఆవరణలో పడుకున్న గుణ తోటలోని మామిడి చెట్టుకు ఉరేసుకుని, మరణించాడు. ఉదయం అతడు కనిపించకపోవడంతో కుటుంబీకులు తోటలో వెతకగా.. మామిడి చెట్టుకు వేలాడుతూ కనిపించాడు. దీంతో బోరున విలపించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. గుణ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యప్తు చేపట్టారు.

ఎస్సీ వర్గీకరణ.. ఓ కుట్ర

మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ రత్నాకర్


మాట్లాడుతున్న రత్నాకర్

అనంతపురం టౌన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ.. కులాల మధ్య చిచ్చుపెట్టే కుట్ర అని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ రత్నాకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన మాట్లాడారు. మాల సామాజికవర్గంపై కక్షసాధింపుతోనే ఎస్సీ వర్గీకరణ విషయంలో కుట్రలు చేస్తున్నారంటూ ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణను వెంటనే వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ అంశంపై వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి వైఖరిని ప్రకటించాలన్నారు. కులమతాల పేరుతో ప్రజలను విభజించి పాలించే పద్ధతిని బీజేపీ అవలంభిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జాలకుంట కేశవప్రసాద్, పెద్దిరెడ్డిపల్లి అరవిందకుమార్, నల్లారి శంకర్‌బాబు పాల్గొన్నారు.

అప్పు చెల్లించలేదని దాడి

ఐదుగురిపై కేసు

ధర్మవరం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కెట్‌యార్డు సమీపంలో లారీ డ్రైవర్‌పై దాడిచేసిన ఘటనకు సంబంధించి ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ రెడ్డప్ప శుక్రవారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నార్పల మండలం దామలూరు గ్రామానికి చెందిన గురుప్రసాద్ లారీ డ్రైవర్‌గా పనిచేస్తుండేవాడు. 8 ఏళ్లక్రితం మదనపల్లి నుంచి దామలూరుకు వలస వచ్చాడు. ఏడాది క్రితం తాడిపత్రికి చెందిన జోసెఫ్‌తో రూ.50వేలు అప్పుగా తీసుకున్నాడు. గురుప్రసాద్ ఆర్థిక ఇబ్బందుల కారణంగా జోసెఫ్ వద్ద తీసుకున్న అప్పు తిరిగి ఇవ్వలేదు. దీంతో జోసెఫ్.. పలుమార్లు ఫోన్ చేసినా డబ్బు సర్దుబాటు కాలేదని చెప్పాడు. ఈ క్రమంలో ఈనెల 18న గురుప్రసాద్ లారీలో సిమెంట్ లోడ్ చేసుకుని తాడిపత్రి నుంచి బెంగళూర్‌కు బయల్దేరాడు. రాత్రి 10.30 గంటల సమయంలో ధర్మవరం మార్కెట్‌యార్డు వద్దకు రాగానే జోసెఫ్ అనుచరులు బాబాఫక్రుద్దీన్, కాశీం, సునీల్, అబ్దుల్లా, మరొక వ్యక్తి లారీని అడ్డగించి గురుప్రసాద్‌ను కిందకు దింపి, దాడిచేశారు. వారి నుంచి గురుప్రసాద్ తప్పించుకుని, మదనపల్లికి వెళ్లిపోయాడు. దీంతో దాడిచేసిన జోసెఫ్ అనుచరులు బాబాఫక్రుద్దీన్, కాశీం, సునీల్, అబ్దుల్లా, మరొక వ్యక్తిపై టూటౌన్ పోలీసు స్టేషన్‌లో గురుప్రసాద్ శుక్రవారం ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ రెడ్డప్ప తెలిపారు.

మానవాళికి ఆదర్శం.. శ్రీకృష్ణుడి జీవితం

మంత్రులు సత్యకుమార్, సవిత

శ్రీకృష్ణుడి మందిర నిర్మాణానికి భూమి పూజ


పూజా కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు, ఎంపీ నాయకులు

సోమందేపల్లి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణుడి జీవితం సర్వమాన వాళికి ఆదర్శమని మంత్రులు సత్యకుమార్, సవిత పేర్కొన్నారు. స్థానిక నక్కలగుట్ట కాలనీలో శ్రీకృష్ణుడి మందిర నిర్మాణం భూమిపూజ కార్యక్రమంలో శుక్రవారం వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ శ్రీకృష్ణుడి నిజ జీవితంలో ఆచరించిన విధానాలు నేటి మానవళికి అనుసరణీయమన్నారు. అన్ని కళలు సంపూర్ణంగా తెలిసినా మిడిసి పడక ప్రజలను గౌరవిస్తూ, ధర్మపాలన చేశాడని కొనియాడారు. కురుక్షేత్ర యుద్ధాన్ని తానొక్కడే ముగించే సత్తా ఉన్నా తను సూత్రధారిగా మారి అర్జునుడి చేత ధర్మయుద్ధం చేయించి దుష్టసంహారం గావించాడన్నారు. హితోపదేశం పేరుతో సర్వమానవాళికి భగవద్గీత అనే గొప్ప గ్రంథాన్ని అందించాడన్నారు.

2024లో ధర్మమే గెలిచింది : మంత్రి సవిత

2024లో జరిగిన ఎన్నికల్లో అధర్మంపై ధర్మం గెలిచిందని మంత్రి సవిత తెలిపారు. గత పాలకులు ఐదేళ్ల అధికారంలో ఉండి రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారని విమర్శించారు. రాష్ట్రాన్ని అంధకారం, అప్పుల్లో నెట్టినా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా సాగుతోందన్నారు. శ్రీకృష్ణుడు బోధించిన గీతాసారాన్ని ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు ఒంటబట్టించుకుని ధర్మపాలన చేస్తున్నట్లు కితాబునిచ్చారు. పెనుకొండలో ఆగిన ఇస్కాన్ టెంపుల్ నిర్మాణం త్వరలో ప్రారంభం అవుతుందన్నారు.

బీసీలు ఐక్యంగా ఉండాలి : బీకే పార్థసారథి, ఎంపీ

బీసీ కులాలు ఐక్యంగా ఉంటూ అభివృద్ధి చెందాలని హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి పేర్కొన్నారు. అగ్ర కులాలను చూసి, అభివృద్ధి చెందినవారిని చూసి ఈర్ష్య పడరాదన్నారు. తమ పిల్లలను చదివించుకుని వ్యాపారాలు నిర్వహించి ఆర్థికంగా ఎదగడంతోపాటు రాజకీయంగా కూడా అభివృద్ధి చెందాలని ఆయన కోరారు.

నిర్మాణాలకు విరాళాలు

ఈ సందర్భంగా ఆలయ నిర్మాణంతోపాటు కల్యాణమండపం నిర్మాణం కోసం మంత్రి సత్యకుమార్ రూ.5లక్షలు, మంత్రి సవిత రూ.5లక్షల 116 ప్రకటించారు. ఎంపీ బీకే పార్థసారథి రూ.20 లక్షలు ఇస్తున్నట్లు తెలిపారు. అలాగే యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కేశవయ్య రూ.5లక్షలు, ముదిగుబ్బ ఆదినారాయణ రూ.లక్ష విరాళాన్ని ప్రకటించారు. మంత్రి సవిత అభ్యర్థన మేరకు 2027లోపు పెనుకొండలో అర్థాంతరంగా ఆగిన వైద్య కళాశాల నిర్మాణాన్ని పూర్తిచేస్తామని మంత్రి సత్యకుమార్ హామీ ఇచ్చారు. అనంతరం వేణుమాధవ యాదవ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. సాంస్కృతిక కార్యక్రమాలు, విచిత్ర వేషధారణ, కృష్ణుడి ఉత్సవ విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో యాదవ సంఘం అధ్యక్షుడు మహేష్, ఉమ్మడిజిల్లా అధ్యక్షుడు లక్ష్మీ నరసింహప్ప యాదవ్, అనంతపురంజిల్లా అధ్యక్షుడు వెంకటసూరి, రాష్ట్ర సంఘం నాయకులు నారాయణ, నగర కార్పొరేషన్ చైర్మన్ వెంకటరాముడు, కార్మిక సంక్షేమశాఖ బోర్డు చైర్మన్ వెంకటశివుడు యాదవ్, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ డీవీ ఆంజనేయులు, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ జయసూర్య, జాతీయ యాదవ సంఘం నాయకులు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దసరా, దీపావళికి ప్రత్యేక రైళ్లు



గుంతకల్లు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీ, దసరా, దీపావళి పండుగలను పురస్కరించుకుని ప్రత్యేక వీక్లీ రైళ్లను నడపనున్నట్టు రైల్వే అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. చర్లపల్లి-తిరుపతి (07011) ప్రత్యేక వీక్లీ రైలు సెప్టెంబరు 5 నుంచి 26 వరకూ శుక్రవారాలలో, దీని తిరుగు ప్రయాణపు రైలు (07012) సెప్టెంబరు 6 నుంచి 27 వరకూ శనివారాలలో నడపనున్నట్లు తెలియజేశారు. ఈ రైలు మల్కాజ్‌గిరి, కాచిగూడ, ఉందానగర్, షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, వనపర్తి రోడ్, గద్వాల, కర్నూలు సిటీ, డోన్, గుత్తి, తాడిపత్రి, యర్రగుంట్ల, కడప, ఒంటిమిట్ట, రాజంపేట, రేణిగుంట, స్టేషన్ల మీదుగా వెళ్తుందన్నారు. తిరుపతి-హిసర్ ప్రత్యేక రైలు (07717) అక్టోబరు 1 నుంచి నవంబరు 26 వరకూ బుధవారాలలో, దీని తిరుగు ప్రయాణపు రైలు (07718)ను ఈ నెల అక్టోబరు 5 నుంచి నవంబరు 30 వరకూ ఆదివారాలలో నడుపుతామన్నారు. ఈ రైలు రేణిగుంట, రాజంపేట, కడప, యర్రగుంట్ల, తాడిపత్రి, గుత్తి, గుంతకల్లు, డోన్, కర్నూలు సిటీ, గద్వాల, మహబూబ్ నగర్, జడ్చర్ల, కాచిగూడ, మల్కాజ్‌గిరి, మేడ్చల్, కామారెడ్డి,నిజామాబాద్,బాసర, ధర్మబాద్, ముడ్‌ఖేడ్, నాందేడ్, పూర్ణా, బస్మత్, హింగోళి, వాసిం, అకోలా, షేగావ్, మల్కాపూర్, భుస్వాల్, జల్‌గావ్, ధరన్‌గావ్, అమల్నేర్, నందుర్బార్, ఉద్నా, వడోదర, రత్లం, మాండ్‌సౌర్, నీమచ్, చిత్తౌర్‌ఘర్, భిల్వారా, బిజయ్‌నగర్, నాసిర్‌బాద్, అజ్మీర్, క్రిష్ణాఘర్, ఫులేరా, రింగస్, సికర్, నవాల్‌ఘర్, ఝుంజును, చిరావా, లోహరు, సదుల్‌పూర్ స్టేషన్ల మీదుగా వెళ్తుందన్నారు. నాందేడ్-ధర్మవరం (07189) ప్రత్యేక రైలు సెప్టెంబరు 5 నుంచి 26 వరకూ శుక్రవారాలలో, దీని తిరుగు ప్రయాణపు రైలు (07190) సెప్టెంబరు 7 నుంచి 28 వరకూ ఆదివారాలలో నడుస్తుందన్నారు. ఈ రైలు ముద్ఖేడ్, ధర్మాబాద్, బాసర, నిజామాబాద్, ఆర్మూర్, లింగంపేట, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జమ్మికుంట, వరంగల్లు, మహబూబాబాద్, డోర్నకల్లు, ఖమ్మం, మధిర, విజయవాడ, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, రేణిగుంట, తిరుపతి, పాకాల, పీలేరు, మదనపల్లి, కదిరి స్టేషన్ల మీదుగా ధర్మవరం చేరుతుందన్నారు. బెంగళూరు-బీదర్ ప్రత్యేక రైలు (06549) ఈనెల 26న, దీని తిరుగు ప్రయాణపు రైలు (06550) ఈ నెల 27న, బెంగళూరు-బీదర్ (06530) ప్రత్యేక రైలు సెప్టెంబరు 5 నుంచి 28 వరకూ శుక్ర, ఆదివారాలలో, దీని తిరుగు ప్రయాణపు రైలు (06540) సెప్టెంబరు 6 నుంచి 29 వరకూ శని, సోమవారాలలో నడుపుతున్నట్లు తెలియజేశారు. ఈ రైళ్లు యల్హంక, హిందూపురం, ధర్మవరం, అనంతపురం, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్, రాయచూరు, క్రిష్ణా, యాదగిరి, వాడి, షాహబాద్, కలబురగి, హోమ్నాబాద్ స్టేషన్ల మీదుగా నడుస్తాయన్నారు. యశ్వంతపూర్-ధన్‌బాద్ (06563) ప్రత్యేక రైలు ఈ నెల 23 నుంచి డిసెంబరు 27 వరకూ శనివారం, దీని తిరుగు ప్రయాణపు రైలు (06564) ఈ నెల 25 నుంచి డిసెంబరు 29 వరకూ నడపనున్నట్లు వివరించారు. ఈ రైలు యల్హంక, ధర్మవరం, అనంతపురం, గుత్తి, డోన్, కర్నూలు సిటీ, మహబూబ్‌నగర్, కాచిగూడ, ఖాజీపేట్, రామగుండం, బాలార్షా, నాగపూర్, ఇటార్సి, నరసింగ్‌పూర్, మదన్‌మహల్, కట్ని, సాట్నా, ప్రయాగరాజ్, మీర్జాపూర్, దీన్‌దయాళ్ ఉపాధ్యాయ స్టేషన్, బబువా రోడ్, ససరం, అనుగ్రహ నారాయణ్, గయ, కోడేర్మ, హజారీబాగ్, పరశ్‌నాథ్, గోమహ్ స్టేషన్ల మీదుగా వెళ్తుందన్నారు.

సెక్టోరల్స్ భర్తీ ఎప్పుడో..?

ఇంటర్వ్యూలు ముగిసినా తేలని తుది ఫలితం


ఇంటర్వ్యూలకు హాజరైన టీచర్లు (ఫైల్)

అనంతపురం విద్య, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సమగ్ర శిక్ష సెక్టోరల్స్ పోస్టుల భర్తీ మళ్లీ సందిగ్ధంలో పడింది. ఆంధ్రజ్యోతి దిన పత్రికలో వచ్చిన వరుస కథనాలకు జిల్లా అధికారులు స్పందించి పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చి, ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం ఆరు సెక్టోరల్స్ పోస్టులకు 71మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 24 దరఖాస్తులను తిరస్కరించారు. మిగిలిన 47మందికి ఈనెల 11, 12 తేదీల్లో కలెక్టరేట్‌లో అసిస్టెంట్ కలెక్టరు సచిన్ రహర్, డీఈఓ ప్రసాద్‌బాబు, సమగ్రశిక్ష ఏపీసీ శైలజ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంటర్వ్యూలకు 42మంది హాజరయ్యారు. అయితే ఇంటర్వ్యూలు ముగిసి 15రోజులు కావస్తున్నా పోస్టుల భర్తీ మాత్రం పూర్తి కాలేదు. ఇంటర్వ్యూలు ముగిసిన వెంటనే కలెక్టరుతో మాట్లాడి అభ్యర్థులను ప్రకటిస్తారని అందరూ ఊహించారు. ఇంటర్వ్యూల సమయంలో ఇన్‌చార్జ్ కలెక్టరుగా జేసీ శివనారాయణశర్మ ఉండేవారు. దీంతో ప్రక్రియ ముగుస్తుందని అనుకున్నారు. కానీ నియామకాల ప్రక్రియ జరగలేదు. అనంతరం శిక్షణకు వెళ్లిన రెగ్యులర్ కలెక్టరు వినోద్‌కుమార్ జాయిన్ అయ్యారు. దీంతో సెక్టోరల్స్ ఎంపిక కలెక్టరేట్‌లోనే ఉండిపోయింది. ఇప్పటికే ఏడాది కాలంగా సమగ్రశిక్షలో ఖాళీగా ఉన్న సెక్టోరల్స్ భర్తీ ఎప్పటికి పూర్తవుతోందోననే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.

కలెక్టరేట్‌లో అప్పగించాం: శైలజ, ఏపీసీ, ఎస్ఎస్ఏ

సెక్టోరల్స్ నియామకాలకు సంబంధించి ఇంటర్వ్యూలు పూర్తి చేశాం. ఇంటర్వ్యూకు హాజరైన 42 మంది వివరాల ఫైలు అసిస్టెంట్ కలెక్టరుకు అప్పగించాం. అక్కడ నుంచి అభ్యర్థుల ఎంపిక జాబితా రావాల్సి ఉంది.

పరిశ్రమలను స్థాపించండి: కలెక్టర్


సమావేశంలో కలెక్టర్, జేసీ

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిశ్రమల స్థాపనకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని కలెక్టర్ వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో 61వ జిల్లా పరిశ్రమలు, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. అన్ని శాఖల వారు పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించి, పరిశ్రమలు ఏర్పాటు చేసేలా మంచి వాతావరణం కల్పించాలని ఆదేశించారు. సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా అన్ని రకాల అనుమతులు ఇవ్వాలని సూచించారు. 2020-23 పాలసీలో రెండు యూనిట్లకు రూ.2,60,71 సబ్సిడీ మంజూరుకు ఆమోదం తెలిపారు. స్టాండప్ ఇండియా పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీలకు విరివిగా రుణాలు మంజూరు చేయించాలని ఎల్డీఎంను ఆదేశించారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల అధికారి శ్రీనివాస యాదవ్, జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ శేషాద్రి శేఖర్, డీటీసీ వీర్రాజు, జిల్లా ఫైర్ అధికారి శ్రీనివాసరెడ్డి, ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ రాధాకృష్ణ , ఏపీఐఐసీ జెడ్ఎం నాగకుమార్, పరిశ్రమల శాఖ ఏడీ రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలపై సమీక్ష

నిషేధిత జాబితాలోని 22ఏ, చుక్కల భూముల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి 22ఏ కమిటీ, డీఎల్సీ/డీఎల్ఎస్సీ సమావేశాన్ని జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మతో కలిసి శుక్రవారం నిర్వహించారు. 22ఏకి సంబంధించిన32 క్లెయిమ్స్‌ను పరిశీలించారు. అందులో 25 ఆమోదించారు, మూడింటిని తిరస్కరించారు. నాలుగు దరఖాస్తులను పునఃపరిశీలించాల్సి ఉందని తెలిపారు. చుక్కల భూములకు సంబంధించి 26 క్లెయిమ్స్‌ను విచారించామని కలెక్టర్ తెలిపారు. అందులో 14 ఆమోదించామని, ఆరింటిని తిరస్కరించి, మరో ఆరింటిని పునఃపరిశీలించాలని ఆదేశించామని అన్నారు. 22ఏ, చుక్కల భూములకు సంబంధించి అనంతపురం రూరల్, కూడేరు, ఆత్మకూరు, రాప్తాడు, బెళుగుప్ప, శెట్టూరు, రాయదుర్గం, బ్రహ్మసముద్రం, పామిడి మండలాల పరిధిలో దరఖాస్తులను విచారించారు. సమావేశంలో డీఆర్ఓ మల్గోల, ఆర్డీఓలు కేశవనాయుడు, వసంతబాబు, శ్రీనివాస్, కలెక్టరేట్ ఈ-సెక్షన్ సూపరింటెండెంట్ రియాజుద్దీన్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

అనధికార లేఅవుట్లను ఉపేక్షించేది లేదు

అహుడా వైస్‌చైర్మన్, జేసీ శివనారాయణ శర్మ


మాట్లాడుతున్న శివనారాయణ శర్మ

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): అహుడా పరిధిలోని అనధికార లేఅవుట్లను ఉపేక్షించేది లేదనీ, కఠిన చర్యలు తీసుకుంటామని అహుడా వైస్‌చైర్మన్, జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ హెచ్చరించారు. అహుడా కార్యాలయంలో శుక్రవారం అనధికార లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణ పథకంపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. అనధికార లేఅవుట్లలో మౌలిక వసతులు విద్యుత్తు, నీరు, రోడ్లు, మురుగు కాలవల నిర్మాణాలు చేపట్టబోమన్నారు. లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకం (ఎల్ఆర్ఎస్) కింద ప్లాట్లకు అనుమతి పొందాలని సూచించారు. కార్యక్రమంలో అహుడా కార్యదర్శి రామకృష్ణారెడ్డి, ప్లానింగ్ అధికారి ఇషాక్ పాల్గొన్నారు.

కదిరిలో గంజాయి ముఠా అరెస్టు

10 కిలోల సరుకు స్వాధీనం


పట్టుబడిన నిందితులు, స్వాధీనం చేసుకున్న గంజాయిని చూపుతున్న డీఎస్పీ

కదిరి అర్బన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): గంజాయిని అక్రమంగా రవాణా చేసి, విక్రయిస్తున్న ముఠాను శ్రీసత్యసాయి జిల్లా కదిరి అప్‌గ్రేడ్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. కదిరి డీఎస్పీ శివనారాయణస్వామి విలేకరుల సమావేశంలో శుక్రవారం ఈ కేసు వివరాలను వెల్లడించారు. కదిరి మండలంలోని కొండమనాయునిపాళ్యం గ్రామ సచివాలయం వద్ద గంజాయి ముఠా ఉన్నట్లు సమాచారం రావడంతో అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ సీఐ నిరంజన్‌రెడ్డి తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఆరుగురిని అరెస్టు చేసి, వారినుంచి 10కిలోల గంజాయి, మూడు ద్విచక్రవాహనాలు, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠా మహారాష్ట్ర నుంచి అక్రమంగా గంజాయిని ఇక్కడికి తీసుకు వచ్చి.. చిన్న ప్యాకెట్లుగా మార్చి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. అక్కడ కిలో రూ.2 వేలకు కొనుగోలు చేసి, ఇక్కడ రూ.7 వేల నుంచి రూ.10వేలకు విక్రయిస్తున్నారని డీఎస్పీ తెలిపారు. పట్టుబడినవారిలో కదిరికి చెందిన ఆజాద్, మహమ్మద్ సోయాద్, షేక్ ఇర్షాన్, షేక్ మహమ్మద్ హుస్సేన్, షేక్ అస్లాం, ఎస్ గౌస్ బాషా ఉన్నారు. వీరిలో ప్రధాన నిందితుడు ఆజాద్.. గంజాయిని మహారాష్ట్రలోని పైజాపూర్‌లో రాజు అనే వ్యక్తి వద్ద కొనుగోలు చేసి, అక్కడి నుంచి రైలులో పుట్టపర్తికి తీసుకువస్తాడు. అక్కడి నుంచి ద్విచక్రవాహనాలలో కదిరికి వచ్చి, చిన్న ప్యాకెట్లుగా మారుస్తారు. ఒక్కో ప్యాకెట్‌ను రూ.200 నుంచి రూ.500కు విక్రయిస్తుంటారు. గంజాయిని విక్రయిస్తున్న రాజును అరెస్టు చేసేందుకు మహారాష్ట్రకు ఓ బృందాన్ని పంపామని డీఎస్పీ తెలిపారు.

జాతీయ బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక


చైత్రేష్


రాహిల్


సోహానా


నిక్కే శ్రీరెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): జాతీయ బాస్కెట్‌బాల్ పోటీలకు ఉమ్మడి జిల్లాకు చెందిన నలుగురు ఎంపికయ్యారు. ఇటీవల పిఠాపురంలో నిర్వహించిన ఏపీ జూనియర్ రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో అదరగొట్టిన చైత్రేష్, రాహిల్ ఎంపికయ్యారు. బాలికల విభాగంలో సోహానా, నిక్కే శ్రీ ఎంపికైనట్లు జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీకాంత్‌రెడ్డి, నరేంద్రచౌదరి తెలిపారు. ఎంపికైన వారు శనివారం నుంచి పిఠాపురంలో నిర్వహించే జాతీయ శిక్షణలో పాల్గొంటారనీ, అనంతరం పంజాబ్‌లోని లూధియానాలో జరిగే జూనియర్ నేషనల్ చాంపియన్‌షిప్‌కు ఏపీ తరపున ప్రాతినిధ్యం వహించనున్నారని తెలిపారు. జాతీయ పోటీలకు ఎంపికైన వారికి అభినందనలు తెలిపారు.

హెచ్చెల్సీ ఏఈఈ ఆత్మహత్య

కుంగుబాటుతోనేనని తండ్రి ఫిర్యాదు

అనంతపురం క్రైం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్కే నగర్‌లో శుక్రవారం రాత్రి హెచ్చెల్సీ లోకలైజేషన్ డివిజన్‌లో ఏఈఈగా పనిచేస్తున్న సుమియా(32) మానసిక కుంగుబాటుతో ఆత్మహత్య చేసుకుంది. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హెచ్చెల్సీ లోకలైజేషన్ డివిజన్‌లో సుమియా(32), ఆమె భర్త పామిడి మహమ్మద్ షఫీ(38) ఏఈఈలుగా పనిచేస్తున్నారు. ఆర్కె నగర్‌లో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. వీరికి మన్హా నాఫియా(3), మహిరా ఇరమ్(2) సంతానం. సుమియా కొంతకాలంగా హార్మోన్ల అసమతుల్యంతో మానసికంగా ఇబ్బంది పడుతుండేది. చికిత్స కూడా తీసుకుంటుండేది. వారంరోజులు ఆమె మాత్రలు వేసుకోలేదు. గురువారం ఆమె తల్లిదండ్రులు వచ్చి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. రాత్రి సుమియా, ఆమె భర్త ఒక గదిలో, ఆమె తల్లిదండ్రులు, పిల్లలు మరో గదిలో పడుకున్నారు. తెల్లవారుజామున సుమియా ఫ్యాన్‌కు ఉరేసుకున్నట్లు ఆమె తండ్రి గుర్తించాడు. హుటాహుటిన కారులో ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా... పరీక్షించిన డాక్టర్లు మరణించినట్లు నిర్ధారించారు. మానసిక వ్యాధితోనే మృతి చెందినట్లు సుమియా తండ్రి బాబా సాహెబ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

వచ్చే ఐదు రోజులు మోస్తరు వర్షం

బుక్కరాయసముద్రం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో రానున్న ఐదు రోజుల్లో తేలిక పాటిగానీ, మోస్తరు వర్ష సూచన ఉన్నట్లు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త గుత్తా నారాయణస్వామి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షం పడే అవకాశం ఉందన్నారు. గరిష్ఠంగా 33.4-34.2, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 23.4-24 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదు కావచ్చన్నారు. పశ్చిమ దిశగా గాలులు గంటకు 13-15కి.మీ, వేగంతో వీచే అవకాశం ఉందన్నారు. గాలిలో తేమ ఉదయంపూట 69-74, మధ్యాహ్నం 40-50 నమోదయ్యే అవకాశం ఉందన్నారు.

యూరియా కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

● రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ ప్రసాద్

అనంతపురం క్రైం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాల్లో యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్(ఆర్‌వీఈఓ) వైబీపీటీఏ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఉమ్మడి జిల్లాలోని యూరియా విక్రయదారులు, డీలర్లు, సరఫరాదారులు రైతులకు సక్రమంగా యూరియాను అందజేయాలన్నారు. యూరియా డీలర్లపైన ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. యూరియాను వ్యవసాయేతర కార్యక్రమాలకు మళ్లించడం, కృత్రిమ కొరత సృష్టించడం, అధిక ధరలకు అమ్మడం, స్టాకు ఉన్నా నో స్టాక్ బోర్డులు పెట్టడం వంటివి చేసి రైతులను ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు.

న్యూస్ బాక్స్

దివ్యాంగుల పింఛన్లు కొనసాగించాలి



మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న దివ్యాంగులు

ధర్మవరం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): రీ వెరిఫికేషన్ పేరుతో అర్హులైన దివ్యాంగుల పింఛన్లను తొలగించారని, వాటిని యథావిధిగా కొనసాగించాలని బాధితులు మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు దివ్యాంగులు శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌ను కలిసి సమస్యను విన్నవించారు. ఎన్నో ఏళ్లగా పింఛన్ తీసుకుంటున్న దివ్యాంగులకు రీవెరిఫికేషన్ పేరుతో తొలగించారని, వాటిని కొనసాగించాలని కమిషనర్‌కు ఇచ్చిన వినతి పత్రంలో కోరారు.

వాల్మీకి కల్యాణ మండపానికి స్థలం కేటాయించండి

ధర్మవరం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వాల్మీకి కులస్థులు కల్యాణమండపం నిర్మించుకోవడానికి ఎకరా స్థలం కేటాయించేలా చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్‌కు వాల్మీకి సంఘం నాయకులు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. స్థానిక ఇందిరమ్మకాలనీలో వాల్మీకి సంఘం నాయకులు ఆయనను కలిసి విన్నవించారు. కార్యక్రమంలో వాల్మీకిసంఘం నాయకులు మద్దిలేటి, రవిచంద్ర, చంద్రమోహన్‌బాబు, కిష్ట, బాలచంద్రుడు, రాజన్న, సాయి, రామాంజి, నాగరాజు, లింగప్ప, జయప్ప, దుర్గేశ్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నేడు మంత్రి శంకుస్థాపన

ధర్మవరం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాంనగర్‌లో 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టనున్న కాలువలు, పైపులైన్లకు భూమి పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భూమిపూజా కార్యక్రమాలకు శనివారం ఉదయం 10 గంటలకు మంత్రి సత్యకుమార్‌యాదవ్ హాజరుకానున్నారని తెలిపారు. అదే విధంగా రాంనగర్‌లో పెంపుడు జంతువుల ఆసుపత్రి, స్వర్ణ ఆంధ్రా-స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమంలో పాల్గొంటారని వివరించారు.

'నిబంధనలకు విరుద్ధంగా పాఠశాల నిర్వహణ'

బత్తలపల్లి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన బత్తలపల్లిలో ఫోనెక్స్ గ్లోబల్ స్కూల్‌ను నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్నా అధికారులు చర్యలు తీసుకోలేదని ప్రైవేటు పాఠశాలల సంఘం నాయకులు తెలిపారు. స్థానిక విజేత పాఠశాలలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. బత్తలపల్లిలో ఇటీవల ఫోనెక్స్ గ్లోబల్ స్కూల్ ఏర్పాటు చేశారని తెలిపారు. ప్రీప్రైమరీ తరగతులు నిర్వహిచకుడదని ఎంఈఓ సీజ్ చేసినా తరగతులు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. వారి పాఠశాలలో చదివే విద్యార్థుల పేర్లను ఇతర జిల్లాలలో ఆన్‌లైన్‌లో నమోదు చేశారని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నారని అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని అన్నారు. కార్యక్రమంలో ప్రైవేటు పాఠశాలల సంఘం నాయకులు వెంకటరాముడు, క్రిష్ణ, లక్ష్మీనారాయణ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ పునరుద్ధరించాలి



ఇన్‌చార్జ్ తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న ఆర్డీటీ అభిమానులు

ఓబుళదేవరచెరువు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి):పేదలకు అండగా ఉన్న ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏను కేంద్రం పునరుద్ధరించాలని ఆర్డీటీ అభిమాన సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం ఇన్‌చార్జ్ తహసీల్దార్ శ్రీనివాసరెడ్డికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు నాగేళ్ల బావన్న, సర్పంచ్ గోవిందు, నిజాం, ఆశీర్వాదమ్మ మాట్లాడుతూ.. ఆర్డీటీ పేదల బాగుకోసం ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తోందన్నారు. విద్య, వైద్యంతో పాటు పక్కా గృహాలు, కమ్యూనిటీ భవనాలు, రైతులకు డ్రిపులు, మంచినీటి బోర్లు, వ్యవసాయ పనిముట్లు ఇలా ఎన్నో చేస్తోందన్నారు. అలాంటి సంస్థకు కేంద్రం ఎఫ్‌సీఆర్‌ఏని రెన్యువల్ చేయకుండా కాలయాపన చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో అభిమాన సంఘం నాయకులు తిరుపాల్, గంగా, సురేష్, గంగాద్రి, లక్ష్మమ్మ, నరసింహులు, మల్లమ్మ, లక్ష్మీపతి, విభిన్నప్రతిభావంతులు, రైతులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లికి ప్రత్యేక పూజలు



కొత్తచెరువు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసంలో చివరి శుక్రవారం పెద్దమ్మతల్లికి పూజారి పెద్దన్న ప్రత్యేక పూజలు చేశారు. పెద్దమ్మతల్లికి వివిధ రకాల పూలు, నిమ్మకాయలు, తులసీ ఆకులతో ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. ఆలయంలో వేప చెట్టు వద్ద మహిళలు దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. దీంతో ఆలయం కిటకిటలాడింది.

రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి

కదిరిఅర్బన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ నాయకులు కదిరప్ప పిలుపునిచ్చారు. శుక్రవారం ఇందుకు సంబంధించిన పోస్టర్లను పార్టీ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 23 నుంచి ఒంగోలులో జరిగే మహాసభలను జయప్రదం చేయాలన్నారు. సభలు మూడురోజులపాటు జరుగుతాయని అన్నారు. మహాసభల్లో ప్రజా, భూ సమస్యలపై తీర్మానించి, పరిష్కారం కోసం కార్యక్రమాలు రూపొందిస్తామని తెలిపారు.

ఆదమరిస్తే అంతే..!

స్పీడ్ బ్రేకర్ల వద్ద మోకాలి లోతు గుంతలు

కదిరి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): స్థానిక బైపాస్‌రోడ్డులోని బాలికల జూనియర్ కళాశాల ఎదురుగా ఉన్న స్పీడ్ బ్రేకర్ల వద్ద మోకాళ్లలోతు గుంతలు ఏర్పడ్డాయి. ఆదమరిస్తే కాలో, చేయో విరగడం ఖాయం. వాహనాల్లో వెనుక ఉంటే ఇంకా పెద్ద ప్రమాదం జరిగే అవకాశముంది. స్పీడ్‌బ్రేకర్ల దెబ్బతిని రోడ్డు మధ్యలో పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. వీటిని గమనించకుండా పొరపాటున ద్విచక్రవాహనంలో దాటితే కచ్చితంగా వాహనం పడిపోతుంది. రోజూ కనీసం ఐదా రు ప్రమాదాలు జరుగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.



బాలికల కళాశాల సమీపంలోని స్పీడ్ బ్రేకర్ల వద్ద పెద్ద గుంతలు

రైతులకు కరెంటు కష్టాలు

● సబ్‌స్టేషన్‌లలో సిబ్బంది కొరత
● పట్టించుకోని ఉన్నతాధికారులు



దాడితోట సబ్‌స్టేషన్, సమస్యలు చెబుతున్న రైతులు

తాడిమర్రి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): సబ్‌స్టేషన్లలో విద్యుత్ సిబ్బంది లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాడిమర్రి మండలంలోని దాడితోట, తాడిమర్రి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిస్థితి దారుణంగా తయారయింది. అసలే వర్షాకాలం. ఏ సమయంలో పిడుగులుపడతాయో తెలియని పరిస్థితి. అప్పటికప్పుడు వాటిని పరిష్కరించేందుకు విద్యుత్ సిబ్బంది కూడా సిద్ధంగా ఉండాలి. రాత్రి కాకపోయినా కనీసం పగలైన విద్యుత్ సరఫరా పునరుద్ధరించే విధంగా సిబ్బంది పనిచేయాలి. కానీ ఇక్కడ పరిస్థితి అలా లేదు. లైన్‌మెన్‌లు, పోల్ టూ పోల్, ఏఎల్ఎంలు పూర్తి స్థాయిలో లేకపోవడంతో రైతులే ఆ పనులు చేసుకోవాల్సి వస్తోంది. దాడితోట సబ్‌స్టేషన్ పరిస్థితి మరీ దారుణంగా ఉంది. మండలంలోనే దాడితోట పంచాయతీ పరిధిలో అధిక విస్తీర్ణంలో పండ్లతోటలు సాగవుతాయి. అదేస్థాయిలోనే వరిపంట కూడా సాగవుతుంది. చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కింది భాగంలో గ్రామాలు ఉండటంతో పాటు ప్రతిఏడాది ఏదో ఒక సమయంలో పార్నపల్లి ఏటికి నీరు వదులుతుండటంతో పంటలు బాగా పండిస్తారు. విద్యుత్ సరఫరా సరిగా లేకపోవడంతో పంటలు పండించుకోవడానికి రైతులు తిప్పలు పడుతున్నారు. దాడితోట, తురకవారిపల్లి, నాయనపల్లి గ్రామాలకు లైన్‌మెన్‌గా పనిచేస్తున్న వ్యక్తి రెండు నెలల క్రితం గుండెపోటుతో మృతి చెందాడు. ఇక అక్కడ పనిచేయడానికి ఎవరకూ లేరు. రైతులే మెయిన్‌లైన్ ఆఫ్ చేసుకుని విద్యుత్‌ను పునరుద్ధరించుకుంటున్నారు. ఏ సమయంలో ఏమి జరుగుతుందోనని భయాందోళనకుగురవుతున్నారు. ఉన్నతాధికారులకు పలుమార్లు తెలిపినా ఫలితం లేకుండా పోయిందని రైతులు వాపోతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం

తాడిమర్రి మండలంలోని దాడితోట, తాడిమర్రి సబ్ స్టేషన్‌లలో సిబ్బంది సమస్య ఎక్కువగా ఉంది. ఖాళీలను భర్తీ చేయాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. వచ్చే బదిలీలలో సిబ్బంది రావచ్చు. ప్రస్తుతం ఉన్నవారితో సర్దుబాటు చేసుకుని పనిచేయాల్సి వస్తోంది.

- శివయ్య, ఇన్‌చార్జ్ ఏఈ, ట్రాన్స్‌కో

ఎరువుల దుకాణాలను తనిఖీ చేసిన ఆర్డీఓలు



ధర్మవరం, కొత్తచెరువులో తనిఖీలు చేస్తున్న ఆర్డీఓలు మహేష్, సువర్ణ

ధర్మవరంరూరల్/కొత్తచెరువు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ధర్మవరం, కొత్తచెరువు పట్టణాల్లోని ఎరువుల దుకాణాలను శుక్రవారం ఆర్డీఓలు తనిఖీలు చేశారు. ధర్మవరం పట్టణంలోని ఎరువుల దుకాణాలను ఆర్డీఓ మహేష్ తనిఖీ చేసి, గోడౌన్‌లో ఉన్న ఎరువుల స్టాకు వివరాలు, బిల్లులు, నాణ్యత, తూకాలను పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే అమ్మకాలు జరుగుతున్నాయో లేదో బోర్డులను పరిశీలించారు. డీలర్ల లైసెన్సుల గడువు, నిల్వ సదుపాయాలను తనిఖీ చేశారు. ఆయన వెంట ఏడీఏ లక్మానాయక్, తహసీల్దార్ సురేష్‌బాబు, సీఎస్‌డీటీ చెన్నకేశవనాయుడు, ఏఓ ముస్తఫా, వీఆర్ఓ రవిశేఖర్‌రెడ్డి ఉన్నారు. కొత్తచెరువులో పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. స్కేళ్లను పరిశీలించారు. స్టాకు రిజిస్టర్లు, ఎరువుల ధరలను నోటీసు బోర్డులో ప్రదర్శించాలని తెలిపారు. ఎవరైనా ఎరువులను అధిక ధరలకు అమ్మినట్టు తెలిస్తే రిజిస్ట్రేషన్లు రద్దు చేయడంతోపాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఓ సతీశ్‌బాబు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందాలి

సచివాలయ సిబ్బందికి పరిటాల శ్రీరామ్ సూచన



సచివాలయంలో ప్రజలు ఇచ్చిన అర్జీలను పరిశీలిస్తున్న పరిటాల శ్రీరామ్

ధర్మవరం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందాలని, అందులో ఎక్కువగా మీ పాత్రే ఉందని సచివాలయ సిబ్బందితో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ అన్నారు. మీ సమస్య-మా బాధ్యత కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వచ్చిన అర్జీల పరిష్కారం కోసం ఆయన సచివాలయాలకు వెళ్లారు. పట్టణంలోని 21, 27, 32, 34 సచివాలయాలకు టీడీపీ నాయకులు వెళ్లారు. ఇందులో 27వ సచివాలయానికి పరిటాల శ్రీరామ్ స్వయంగా వెళ్లి ప్రజలు ఇచ్చిన అర్జీల గురించి చర్చించారు. సంక్షేమ పథకాలకు సంబంధించి చిన్నచిన్న కారణాలతో అర్హులకు పథకాలు అందకపోవడం గురించి మాట్లాడారు. సంబంధిత పత్రాలు అప్‌లోడ్ చేసి పథకాలు వచ్చేలా చూడాలన్నారు. ముఖ్యంగా ఇల్లు, ఇంటి పట్టాలు, చేనేతల ఉచిత విద్యుత్, రేషన్‌కార్డులు, పింఛన్లు వంటి దరఖాస్తులు వెంటనే అప్‌లోడ్ చేయాలన్నారు. టీడీపీ నాయకులు ప్రతి అర్జీ విషయంలో జవాబుదారీగా ఉండాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ మహేశ్‌చౌదరి, నాయకులు ఫణికుమార్, మద్దిలేటి, కిష్ట, చంద్రమోహన్‌బాబు, అస్లాం, సాయి, బాబూఖాన్, తిరుపాలు, ఆనందరెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు



గాయపడిన ముత్యాలప్ప, హర్షసాయి, అక్షయ్‌కుమార్

ధర్మవరం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపిన వివరాల మేరకు.. శుక్రవారం రాత్రి ఫ్లైఓవర్ బ్రిడ్జిపై రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ముత్యాలప్ప, హర్షసాయి, అక్షయ్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు గాయపడిన ముగ్గురిని ఆటోలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్సల అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పంటలను నమోదు చేయించుకోవాలి : ఏడీఏ



పోతుకుంట వద్ద పంట నమోదును పరిశీలిస్తున్న ఏడీఏ లక్మానాయక్

ధర్మవరంరూరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో సాగుచేసిన పంటలను రైతులు తప్పనిసరిగా ఈ-పంటలో నమోదు చేయించుకోవాలని ఏడీఏ లక్మానాయక్ సూచించారు. శుక్రవారం మండలంలోని పోతుకుంట పొలాల్లో జరుగుతున్న ఈ-పంట నమోదును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నమోదులో సాంకేతిక సమస్యలు ఏమైనా తలెత్తుతున్నాయా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు పంట నమోదు చేసుకుంటేనే ప్రభుత్వ రాయితీలు వర్తిస్తాయన్నారు. ఆయన వెంట ఏఓ ముస్తఫా, సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలను విడుదల చేయాలి

పుట్టపర్తి రూరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయిలకు చెల్లించాల్సిన పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు పీబీ మాధవ్, ప్రధాన కార్యదర్శి ఆర్. చంద్ర డిమాండ్ చేశారు. శుక్రవారం మండల పరిధిలోని పెడపల్లి, నిడిమామిడి, గంగిరెడ్డిపల్లి జిల్లా, మండల పరిషత్ పాఠశాలల్లో ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం దాటినా ఉద్యోగ,ఉపాధ్యాయులకు సంబంధించిన ఆర్థిక, ఆర్థికేతర సమస్యలను ఒక్కటీ పరిష్కరించలేదన్నారు.

పాఠశాలలకు సీఎం, డిప్యూటీ సీఎం చిత్ర పటాలు

ఓబుళదేవరచెరువు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండకమర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు శుక్రవారం సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, విద్యాశాఖమంత్రి నారా లోకేష్, ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి చిత్రపటాలను అందించారు. మైనార్టీ నాయకులు జౌలి అల్లాబక్ష, పాఠశాల కమిటీ చైర్మన్ రవి, శంకరయ్య, లక్ష్మీపతినాయుడు, చంద్రాయుడు చిత్రపటాలను హెచ్ఎం క్రిష్టానాయక్‌కు అందించారు.

శ్రీకృష్ణుడి ప్రతిమ ఊరేగింపు



శ్రీకృష్ణుడి ప్రతిమను ఊరేగిస్తున్న భక్తులు

కొత్తచెరువు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రబోధానంద భక్తులు శ్రీకృష్ణుడి ఉత్సవ ప్రతిమను పల్లకీలో ఏర్పాటు చేసి శుక్రవారం ఊరేగించారు. మొదట పుట్టపర్తిరహదారిలో మండపం నుంచి భజనలు చేస్తూ ఊరేగింపు చేపట్టారు. భక్తులు, ప్రజలు శ్రీకృష్ణుడికి పూజలు చేయించారు. కార్యక్రమంలో ప్రబోధానంద భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఓటు హక్కు నమోదు చేసుకోవాలి: ఆర్డీఓ

ధర్మవరం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): నిబంధనల మేరకు 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని ఆర్డీఓ మహేశ్ తెలిపారు. శుక్రవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ... ప్రస్తుతం నియోజకవర్గంలోని ధర్మవరం, బత్తలపల్లి, ముదిగుబ్బ, తాడిమర్రి మండలాల్లో 295 పోలింగ్ బూతులకు గాను 295 మంది బీఎల్ఓలను నియమించామని పేర్కొన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. సమావేశంలో డిప్యూటి తహసీల్దార్ ఈశ్వరయ్య, సీనియర్ అసిస్టెంట్ రాఘవరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

వినాయక ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలి

ధర్మవరం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని నిర్వాహకులకు టూటౌన్ సీఐ రెడ్డప్ప సూచించారు. శుక్రవారం టూటౌన్ పరిధిలోని వినాయక ఉత్సవ కమిటీ నిర్వాహకులను సీఐ పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి సమావేశమై పలు సూచనలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అన్ని శాఖల అధికారులతో అనుమతి తీసుకోవాలని, ఎవరికైనా ఇబ్బందులు కల్గించేవిధంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటానమి తెలిపారు.

మట్టి వినాయకులను పూజిద్దాం

ధర్మవరం రూరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మట్టి వినాయకులను పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుకుందామని ఎంపీడీఓ సాయిమనోహర్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఆయన అక్కడికి వచ్చిన ప్రజలు, సిబ్బందికి మట్టి వినాయకులను పూజించాలని కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. రంగులతో కూడిన విగ్రహాలను వల్ల నీరు కలుషితమై పర్యావరణం దెబ్బతింటుందన్నారు. కార్యక్రమంలో ఏఓ అబ్దుల్‌నబీ, ఏపీఓ సుధాకర్, సీనియర్ అసిస్టెంట్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

హాస్టల్ భవనాలను పరిశీలించిన అధికారులు



ఖాళీగా ఉన్న హాస్టల్ భవనాలను పరిశీలిస్తున్న అధికారులు

తనకల్లు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్సీ, ఎస్టీ బాలురు, బీసీ, ఎస్సీ బాలికల హాస్టళ్లను శుక్రవారం మండల అధికారులు పరిశీలించారు. 400 మంది విద్యార్థులకు సౌకర్యాలు ఉన్నా.. హాస్టల్ భవనాలు వృథాగా పడి ఉండడంతో అధికారులు వాటిని పరిశీలించారు. ముఖ్యంగా ఈ ఏడాదే ఖాళీ అయిన బీసీ బాలికల హాస్టల్‌ను పరిశీలించి, సత్వరం చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. కదిరిలో అద్దెభవనంలో నిర్వహిస్తున్న ఎస్టీ బాలికల జూనియర్ కళాశాలను తనకల్లులో నిర్వహించడానికి కావలసిన అన్ని సదుపాయాలున్నాయని అన్నారు. మిగిలిన హాస్టల్ భవనాలను వినియోగంలోకి తీసుకురావడానికి గ్రామ సచివాలయాలను, రైతు సేవాకేంద్రాలను ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. నివేదికలను జిల్లా ఉన్నతాధికారులకు పంపనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామానాయక్, ఈఓఆర్‌డీ మురళీ శ్రీనివాసులు, సచివాలయ, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

బుక్‌లెట్ విధానాన్ని తొలగించాలి : ఏపీటీఎఫ్



ఏడీకి వినతి పత్రం ఇస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

కొత్తచెరువు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): పరీక్షల్లో కొత్తగా తీసుకువచ్చిన అసెస్‌మెంట్ బుక్‌లెట్ విధానాన్ని తొలగించాలని విద్యాశాఖ ఏడీ శ్రీనివాసరావుకు శుక్రవారం ఏపీటీఎఫ్ నాయకులు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ విధానం వల్ల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఉపాధ్యాయులకు పేపర్లను దిద్దేందుకే సమయం సరిపోతుందన్నారు. పాత పద్ధతిలో విద్యార్థులు రాసిన జవాబు పత్రాలను ఇంటికి తీసుకెళ్లి పేపర్లను దిద్దే అవకాశం ఉండేదన్నారు. దీంతో పాఠశాలలో విద్యార్థులకు పాఠాలు చెప్పేందుకు సమయం ఉండేదన్నారు. ప్రస్తుత విధానం వల్ల ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్ర, త్రిమూర్తి, ఈశ్వరప్ప, రాజశేఖర్, ఓబుళేసు, చెన్నకేశవ, కేవీఆర్ నాయుడు, సుధాకర్,గంగాధర్, నరేంద్రరెడ్డి పాల్గొన్నారు.

పింఛన్లపై ఆందోళన చెందవద్దు: ఎమ్మెల్యే

పుట్టపర్తి రూరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): పింఛన్ల తొలగింపుపై ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రీవెరిఫికేషన్‌లో కొంతమంది లబ్ధిదారులకు పింఛన్ ఆగిపోయినట్లు ఆందోళన చెందుతున్న విషయాన్ని స్థానిక ప్రజలు తన దృష్టికి తీసుకొచ్చారని వివరించారు. సదరం మెడికల్ క్యాంపు రీవెరిఫికేషన్‌లో పుట్టపర్తి నియోజకవర్గంలోని సుమారు 1210 పింఛన్లు రద్దు చేసినట్లు అధికారులు ప్రకటించారని అన్నారు. ఇందులో ఇందులో అర్హులైన లబ్ధిదారులకు అన్యాయం జరుగకుండా చూడాలని సూచించామని తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో న కిలీ సర్టిఫికెట్లతో చాలామంది అనర్హులు పింఛన్లు పొందుతున్నట్లు ఆరోపణలు రావడంతో ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా రీవెరిఫికేషన్ చేపట్టిందన్నారు. ఇందులో కొందరు వైద్యాధికాకారుల నిర్లక్ష్యం వల్ల కొంతమంది అర్హులకు అ న్యాయం జరిగి ఉండవచ్చన్నారు. అర్హులకు అన్యాయం జరుగకుండా చూస్తామని ఎమ్మెల్యే భరోసానిచ్చారు.

క్రీమీలేయర్ విధానాన్ని సవరించాలి

కదిరి అర్బన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): క్రీమీలేయర్ విధానాన్ని సవరించాలని బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతా నాగరాజు శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. గతంలో రూ.6.50 లక్షలు ఉన్న ఓబీసీల క్రీమీలేయర్ ఆదాయ పరిమితిని 2017లో రూ.8లక్షలకు పెంచారని పేర్కొన్నారు. 2026 సమీపిస్తున్నా దాన్ని సవరించకపోవడం అన్యాయం అన్నారు. ఆర్థికంగా, విద్యాపరంగా వెనుకబడి ఉన్న ఓబీసీల సమగ్రాభివృద్ధికి మండల్ కమిషన్ విద్య, ఉద్యోగాల్లో 27 శాతం రిజర్వేషన్లను సిఫార్సు చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆ రిజర్వేషన్లను అమలుకు క్రీమీలేయర్ పేరుతో ఆదాయ పరిమితి విధించడం అన్యాయమని, దాన్ని తొలగించాలన్నారు. క్రిమిలేయర్ ఆదాయ పరిమితిని రూ.17లక్షలకు సవరించాలని కోరారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన



జాబ్‌మేళాకు హాజరైన ప్రతినిధులు

కదిరి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్‌టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాకు 195 మంది హాజరైనట్లు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి తేజ్‌కుమార్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ స్మిత తెలిపారు. ఈమేళాకు పది కంపెనీల ప్రతినిధులు హాజరైనట్లు చెప్పారు. మేళాలలో 81 మంది వివిధ కంపెనీలకు ఎంపికైనట్లు వివరించారు. కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి సంస్థ ఉద్యోగులు ఇషాద్‌హుస్సేన్, నాగార్జున పాల్గొన్నారు.

మద్యానికి డబ్బు ఇవ్వలేదని భార్యపై దాడి

● చికిత్స పొందుతూ మృతి

తాడిమర్రి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామాపురం గ్రామంలో మద్యం సేవించేందుకు డబ్బు ఇవ్వలేదని భర్త దాడి చేయడంతో దళిత రామాంజినమ్మ(26) మరణించింది. ఎస్ఐ కృష్ణవేణి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామంలో రామాంజినమ్మ, రాజు దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి ముగ్గురు కుమార్తెలు ప్రసన్న, నీతు, నేహ ఉన్నారు. రాజు మద్యానికి బానిసయ్యాడు. ఈ నేపథ్యంలో ఈనెల 20న మద్యానికి డబ్బులివ్వలేదని భార్యతో గొడవపడి దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన ఆమెను దగ్గరుండి గ్రామ సమీపంలోని నార్పల మండలం గూగూడులోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లాడు. పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె గురువారం రాత్రి మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. రాజు పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలిసింది.

బార్లకు దరఖాస్తు చేసుకోండి

పుట్టపర్తి రూరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా నూతనంగా అనుమతించిన బార్లకు ఆసక్తిగలవారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎక్సైజ్ శాఖాధికారి గోవిందనాయక్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 12 బార్లకు అవకాశం కల్పించారన్నారు. ఇందులో కదిరి, ధర్మవరం 3 చొప్పున, హిందూపురం 4, మడకశిర, పెనుకొండ ఒకటి చొప్పున నిర్ణయించారు. ఈనెల 26 వరకు ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ విధానాల్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఒక బార్‌ను కల్లుగీత కార్మికులకు ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఆగస్టు 28 ఉదయం 8 గంటలకు లాటరీ పద్ధతిలో ఎంపిక చేస్తామన్నారు. దరఖాస్తులను జిల్లా ఎక్సైజ్‌శాఖాధికారి కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుందని ఆయన వివరించారు.

ఘనంగా చిరు జన్మదిన వేడుకలు



కొత్తచెరువులో చిరంజీవి జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న అభిమానులు

కొత్తచెరువు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని స్థానిక శ్రీకృష్ణదేవరాయ సర్కిల్లో మెగాస్టార్ చిరంజీవి 70 జన్మదిన వేడుకలను శుక్రవారం రాత్రి గూడాసోమశేఖర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మొదట శ్రీకృష్ణదేవరాయ విగ్రహానికి పూలమాల వేసి పూజలు నిర్వహించారు. అనంతరం కేక్‌ను కట్‌చేసి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో చిరు అభిమానులు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

● కదిరిఅర్బన్ : సినీనటుడు, మెగాస్టార్ చిరంజీవి జన్మదినం వేడుకలు అఖిలభారత చిరంజీవి యువత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి, సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో చిరంజీవి అభిమానులు లక్ష్మణ్, కార్తీక్, రాజేంద్ర, చక్రీ, హరీష్, అరవిందు, హరిప్రసాద్, విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

●బుక్కపట్నం : చిరంజీవి జన్మదిన వేడుకలను బుక్కపట్నంలో అభిమాన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తేరుకూడలిలో కేక్ కట్ చేసి సంబరాలు చేశారు.

ప్రతి ఇంటికి తాగునీరు: మంత్రి సవిత



విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న మంత్రి సవిత

పెనుకొండ రూరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): జలజీవన్ పథకం కింద ప్రతి ఇంటికీ తాగునీరు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని వెంకటగిరిపాళ్యంలో యల్లమ్మ విగ్రహప్రతిష్ఠలో ఆమె పాల్గొన్నారు. అనంతరం జలజీవన్ పథకం కింద నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

శాకాంబరిగా కొల్హాపురమ్మ



ప్రత్యేక అలంకరణలో కొల్హాపురమ్మ, వడిశలమ్మ

మడకశిర టౌన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వాల్మీకి సర్కిల్‌లో వెలసిన కొల్హాపురమ్మ, మహేశ్వరమ్మ శ్రావణమాసం చివరి శుక్రవారం శాకాంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళలు పెద్దసంఖ్యలో అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అమరాపురం బస్టాండ్ ఆవరణలోని వడిసలమ్మ దేవాలయంలో అమ్మవారికి ఆకుపూజతో అలంకరణ చేశారు. గంగాభవాని, పూజమ్మ, మూలకంఠేశ్వరి, కన్యకాపరమేశ్వరి తదితర దేవాలయల్లో విశేషపూజలు, అర్చనలు, అభిషేకాలు జరిగాయి.

శాంతియుతంగా పండుగ జరుపుకోండి

- డీఎస్పీ నరసింగప్ప



మాట్లాడుతున్న డీఎస్పీ

గోరంట్ల, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): వినాయకచవితి పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని పెనుకొండ డీఎస్పీ నరసింగప్ప, తహసీల్దార్ మారుతి కోరారు. శుక్రవారం పోలీస్‌స్టేషన్ ఆవరణంలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. విగ్రహాల ఏర్పాటు చేసేవారు తప్పకుండా పోలీసుల అనుమతి పొందాలన్నారు. ఏ సమస్య తలెత్తినా ఆవేశాలకు లోనుకాకుండా పోలీసుల దృష్టికి తీసుకువస్తే సమస్య పరిష్కరిస్తామన్నారు. సమావేశంలో సీఐ శేఖర్, ఎస్ఐ రాము పాల్గొన్నారు.

మట్టి వినాయకులను పూజిద్దాం

షిర్డీసాయి గ్లోబల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ శిల్ప అనుపాటి



ర్యాలీలో పాల్గొన్న చైర్‌పర్సన్ శిల్ప, ఆర్డీఓ, విద్యార్థులు

పెనుకొండ, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): వినాయక పండగ సందర్భంగా ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాలని షిర్డీసాయి గ్లోబల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ శిల్ప అనుపాటి పిలుపునిచ్చారు. మట్టివినాయక విగ్రహాల వినియోగంపై శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ షిర్డీసాయి గ్లోబల్ ట్రస్ట్ తరుపున సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ప్రతిఒక్కరూ మట్టివినాయక ప్రతిమలను వినియోగం చేయాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వేద పండితులు పంచాంగం నాగప్రసాద్‌శర్మ, ప్రవీణ్‌కుమార్ వినాయక చవితి విశిష్టతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో మదన్‌మోహన్‌రెడ్డి, ఆర్డీఓ ఆనంద్‌కుమార్, ప్రగతి శ్రీనివాసులు, కర్ణాటక బ్యాంక్ మేనేజర్ నటరాజన్, డైట్ కళాశాల అధ్యాపకులు శివరాం, పీఆర్ ఇంజనీర్ జగదీశ్, ట్రస్ట్ నిర్వాహకులు చిట్టిబాబు, హరి, నాగిరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం కార్యక్రమానికి రూ.50వేలు వసూలు

-పీడీఓను నిలదీసిన విరుపసముద్రం గ్రామస్థులు

పావగడ, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్దరామయ్య గత నెల 21న పావగడలో పర్యటించిన సమయంలో గ్రామ పంచాయతీ నుంచి రూ. 50 వేలు వసూలుచేసినట్లు విరుపసముద్రం గ్రామస్థులు పేర్కొన్నారు. 15వ ఆర్థిక ప్రణాళిక పథకం కింద ఎస్సీ కాలనీలో ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టకుండానే నిధులు డ్రాచేసినట్లు బ్యాంకు ద్వారా వెలుగులోకి వచ్చిందని వారు శుక్రవారం పీడీఓ చిక్కన్నను నిలదీశారు. వికలాంగులు, ప్రతిభా పురస్కారాలు, విద్యానిధులు, డ్రైనేజీ, వీధిలైట్లు, తాగునీటి సౌకర్యాలు అందించకుండానే రూ.4.26లక్షలు అక్రమంగా డ్రాచేశారని ఆరోపించారు. అంతేకాకుండా ప్రతి పంచాయతీ నుంచి ముఖ్యమంత్రి కార్యక్రమానికి రూ.50వేలు వసూలు చేసినట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఈఓ చొరవ తీసుకుని అక్రమంగా చేసిన బిల్లులను ప్రజాప్రయోజనార్థం వెచ్చించాలని విరుపసముద్రం గ్రామస్థులు ఆంజనేయులు, లక్ష్మీకాంత్, అనీల్‌నాయక్ కోరారు.



పీడీఓను నిలదీస్తున్న విరుపసముద్రం గ్రామస్థులు

యూరియాకు భలే డిమాండ్

అందక ఇబ్బంది పడుతున్న రైతులు

సరఫరా చేయాలని వినతి

మడకశిర రూరల్, ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): యూరియాకు భలే డిమాండ్ పెరిగింది. వర్షాలు బాగా పడటంతో యూరియాకు గిరాకీ ఉంది. యూరియా అందక రైతులు ఇబ్బందులు ఎదుర్కొటున్నారు. ఈ ఏడు వేరుశనగ పంటను చాలా మంది రైతులు సాగు చేయలేదు. దీంతో ప్రత్యామ్నాయ పంటలపై దృష్టిసారించారు. మొక్కజొన్న, పత్తి, మల్బరీ, కంది, రాగి, మిరప పంటలను సాగు చేశారు. యూరియా అవసరం కావడంతో రైతులు అందక ఇబ్బందులుపడుతున్నారు. రైతుసేవా కేంద్రాలకు వెళ్లి సమస్యను వివరిస్తున్నారు. తమకు కావాల్సినంత యూరియాను సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.



రైతులు సాగు చేసిన మొక్క జొన్న పంట

డిమాండ్‌కు తగ్గట్టు సరఫరా చేయాలి



డిమాండ్‌కు తగ్గట్టుగా యూరియాను సరఫరా చేయాలి. రైతు సేవా కేంద్రాలు, సొసైటీల్లో యూరియా దొరకడం లేదు. దుకాణాల వద్దకు వెళ్లి యూరియా అడిగితే యూరియా కావలంటే కాంప్లెక్స్ ఎరువులను కొనుగోలు చేయాలని అంటున్నారు. అంతమొత్తం పెట్టి కొనుగోలు చేయలేని పరిస్థితి ఉంది. యూరియాను కావాల్సినంత రైతులకు సరఫరా చేయాలి.

-వెంకటరెడ్డి, సీ కొడిగేపల్లి

గతంలో కంటే డిమాండ్

గతంలో కంటే ఈ యేడు యూరియాకి బాగా డిమాండ్ పెరిగింది. చాలా మంది రైతులు వేరు శనగసాగు చేయకపోవడం, ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయడంతోనే డిమాండ్ ఉంది. ఇప్పటి వరకు 93 టన్నుల యూరియా మడకశిర మండలానికి వచ్చింది. 700 మంది రైతులకు పంపిణీ చేశాం. రైతుల డిమాండ్‌కు తగ్గట్టు యూరియాను సరఫరాకు ఇండెంట్ పంపడం జరిగింది. వారంరోజుల్లో వస్తుంది.

-తిమ్మప్ప, వ్యవసాయశాఖ అధికారి, మడకశిర

అర్హులకు సంక్షేమ పథకాలు

- మంత్రి సత్యకుమార్

పెనుకొండ రూరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): అర్హులకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని మంత్రి సత్యకుమార్ అన్నారు. శుక్రవారం సోమందేపల్లిలో శ్రీకృష్ణుని ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేసేందుకు వెళ్తూ పెనుకొండలోని 44వ జాతీయరహదారి శ్రీకృష్ణ దేవరాయల విగ్రహానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చిన కొన్ని నెలల్లోనే టీటీడీ ఆస్తులు వేలంవేయడం హిందువుల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. ఈ నేపథ్యంలోనే ఎన్నికల్లో వైసీపీ తుడిచిపెట్టుకుపోయిందని మంత్రి అన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు పాలనలో రాష్ట్రం అభివృద్ధిలో పరుగులు తీస్తోందన్నారు. గత వైసీపీ ఐదేళ్లపాలనలో కావలి, రామతీర్థం, అంతర్వేదిలో విగ్రహాలపై దాడులకు పాల్పడటం ఎంతవరకు సమంజసమన్నారు. దేవాలయాలపై దాడులు చేయడం ఏంటని ప్రశ్నించారు. అధికారంలో ఉన్నప్పుడు హిందువుల మనోభావాలు దెబ్బతీసి రాష్ట్రం పరువు ప్రతిష్ఠను నేలపాలు చేశారన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ఓర్వలేక వైసీపీ నాయకులు బురదచల్లుతున్నారన్నారు. తప్పు చేసిన వారిని శిక్షించడంపోయి రౌడీషీటర్లను పరామర్శించడం ఎంతవరకు సమంజసమని దుయ్యబట్టారు. అవినీతి అరాచకాలు చేసి జైలుపాలు అయిన వారిని జగన్ పరామర్శించారు తప్ప ప్రజా సమస్యల కోసం ఏనాడు బయటకు రాలేదని ఎద్దేవా చేశారు. సమావేశంలో బీజేపీ నాయకులు జీఎం శేఖర్, గోపీనాథ్, ఎనుమల రామక్రిష్ణ, గొడ్డుమర్రి ఆదినారాయణయాదవ్, రామాంజినేయులు, రవి, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్

సమస్యలపై మంత్రికి వినతి

రొద్దం, (ఆంధ్రజ్యోతి): పలు సమస్యలపై బీజేపీ నాయకులు మంత్రి సత్యకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. శుక్రవారం మండల బీజేపీ నాయకులు పెనుకొండలోని వైజంక్షన్‌వద్ద రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రిని కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. రొద్దంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం శిథిలావస్థలో ఉన్నందున భవన నిర్మాణాలకు నిధులు ఇవ్వాలని కోరారు. పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో ట్రామాకేర్‌కు సిబ్బందిని నియమించాలని సోమందేపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి భవనాలు ఏర్పాటుచేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి నీరుగంటి వేణుగోపాల్, మండల అధ్యక్షులు పవన్‌కుమార్, తొగట రవిశంకర్, మహదేవ్, తిప్పేస్వామి, రాజు, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో నూతన బార్ పాలసీ: డీసీ

మడకశిర టౌన్, ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నూతన బార్ పాలసీని తీసుకొచ్చినట్లు అనంతపురం ఎన్‌ఫోర్స్‌మెంట్ డీసీ నాగమద్దయ్య అన్నారు. శుక్రవారం మడకశిరలో ఎక్సైజ్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా డీసీ మాట్లాడుతూ నూతన బార్ పాలసీ నోటిఫికేషన్ విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. బార్లలో అమ్మకాల వేళలను పెంచుతూ ప్రభుత్వం నిర్ణయించిదన్నారు. మడకశిరకు ఒక బార్ మంజూరు అయిందని అందుకు ఈనెల 26న నోటిఫికేషన్ విడుదల చేయడం జరుగుతోందన్నారు. ఆన్‌లైన్‌తోపాటు నేరుగా రెండు రూపాల్లో దరఖాస్తులు చేసుకునేందుకు వీలు కల్పించినట్లు వివరించారు. దరఖాస్తులను పరిశీలించి ఈనెల 30న లాటరీ ద్వారా ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. సెప్టెంబరు 1 నుంచి కొత్త బార్ పాలసీ అమల్లోకిరానుందని వివరించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ మురళి కిషోర్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

మద్యం వ్యాపారులతో సమావేశం

హిందూపురం(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో నూతన బార్ పాలసీ విధానంపై మద్యం వ్యాపారులు రియల్ ఎస్టేట్ వ్యాపారులతో ఎక్సైజ్ అధికారులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ డీసీ నాగమద్దయ్య, సూపరింటెండెంట్ గోవిందనాయక్ 2025-28 సంవత్సరాల మధ్య బార్ లైసెన్స్ విధానాలపై వివరించారు. హిందూపురంలో నాలుగు బార్‌లు రానుండగా అందులో ఒకటి గీత కులాలకు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఒక్కో బారుకు రూ.55లక్షలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. గతంలో రూ.62లక్షలదాకా వేలంలో బార్ దక్కించుకున్నారు. దానితో పోల్చుకుంటే ఇప్పుడు ధర తక్కువేనన్నారు. ఉదయం 10గంటల నుంచి రాత్రి 12గంటల వరకు బార్లు తెరుచుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ అధికారులు నరసింహులు, సీఐ లక్ష్మీదుర్గయ్య పాల్గొన్నారు.



పురంలో మద్యం వ్యాపారులతో సమావేశమైన ఎక్సైజ్ అధికారులు

ప్రిన్సిపాల్‌కు సత్కారం



ప్రిన్సిపాల్‌ను సత్కరిస్తున్న కళాశాల బృందం

హిందూపురం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రగతిని శుక్రవారం సత్కరించారు. ఆమె రచించిన బొగ్గుల పొయ్యి కవితను డిగ్రీలో పాఠ్యాంశంగా చేర్చడంపై శుక్రవారం కళాశాల బృందం తోపాటు సువర్ణభారతి ఏఓ కళాశాల యాజమాన్యం సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఓ అనీల్‌కుమార్, రాము, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు అద్దె చెల్లింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పెనుకొండ టౌన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మండల ఎంపీపీ సమీప బంధువు పేరుతో ప్రభుత్వ వాణిజ్య కాంప్లెక్స్ గదుల బకాయి ఉన్న అద్దెలు చెల్లించారు. గురువారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో రాబందువు అన్న శీర్షిక ప్రచురితమైంది. నాలుగు గదులకు సంబంధించిన అద్దె ఎనిమిది నెలల నుంచి చెల్లించకుండా ఎంపీపీ అండతో సమీప బంధువు మొండికేశాడు. అంతేకాకుండా అద్దెలు కూడా ఇతరులకు ఇచ్చి రెండింతలు వసూలు చేస్తున్నారు. ఈ కథనం ప్రచురితం కావడంతో శుక్రవారం రూ.24వేలు ఒకచలానా, రూ.18వేలు చలానా ఇలా రూ.42వేలు చెల్లించారు. మిగిలిన అద్దెను త్వరలో చెల్లిస్తానని ఎంపీడీఓ సురేష్‌కృష్ణతో తెలిపినట్లు సమాచారం.

విద్యుత్ షాక్‌తో ఆవు మృతి

లేపాక్షి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో పాడిఆవు మృతిచెందినట్లు కొండూరు గ్రామ రైతు అశ్వత్థప్ప తెలిపారు. ఆవును గ్రామం చెరువువద్దకు తీసుకెళ్తుండగా ట్రాన్స్‌ఫార్మర్ కిందనే ఉండటంతో విద్యుదాఘాతానికి తగిలి కుప్పకూలిందన్నారు. ప్రభుత్వం స్పందించి పరిహారం అందించాలని బాధితుడు కోరాడు.

చిరుత దాడిలో మేక ..

గుడిబండ, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిగతుర్పి గ్రామానికి చెందిన రంగనాథ్ మేక చిరుత దాడిలో మృతిచెందింది. గురువారం రాత్రి చిరుత మేక మందపై చొరబడి దాడి చేయడంతో మేక మృతిచెందింది. విషయం తెలుసుకున్న మడకశిర అటవీశాఖ అధికారులు చిగతుర్పి గ్రామానికి మేకను పరిశీలించారు.

స్కాలర్‌షిప్‌ల పంపిణీ

రొద్దం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): తురకలాపట్నం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులు పదిమందికి ప్రముఖ బహుళజాతి పురుగుల మందు కంపెనీ బయోస్టాడ్ ఇండియా లిమిటెడ్ స్కాలర్‌షిప్‌లు అందజేశారు. శుక్రవారం ఒక్కొక్కరికి 2500చొప్పున పది స్కాలర్‌షిప్ అందించారు. ఏటా ఏదో పాఠశాలకు స్కాలర్‌షిప్ అందిస్తున్నట్లు కంపెనీ ప్రతినిధి ఏఎస్ఎం సుబ్బారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంగన్న, పెనుకొండ సాయిసీడ్స్ ఏజెన్సీ నిర్వాహకులు సుగుణాకర్‌రెడ్డి, ఫీల్డ్ ఆఫీసర్ సదాశివరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా చిరంజీవి జన్మదిన వేడుకలు



కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకుంటున్న అభిమానులు

పావగడ, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ప్రముఖ చలనచిత్ర నటుడు చిరంజీవి జన్మదిన వేడుకలను పావగడలో శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. శనిమహత్మ సర్కిల్‌లో 70కేజీల కేక్‌ను చిరంజీవి అభిమాన సంఘం అధ్యక్షుడు మనం శశికిరణ్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు, పట్టణ ప్రజలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రమోద్‌కుమార్, నరేష్, నరసింహమూర్తి, ధనుంజయ, భాస్కర్, వెంకటరమణ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

గుడిబండ(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన గుడిబండలో శుక్రవారం సినీనటుడు చిరంజీవి జన్మదిన సందర్భంగా ఫ్యాన్స్ రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. 70 మంది రక్తదానం చేశారు. ఏఎస్ఐ చంద్రశేఖర్ రక్తదాన శిబిరానికి హాజరయ్యారు. కార్యక్రమంలో నాగరాజు, రమేష్‌రెడ్డి, యశ్వంత్, రంగనాథ్, లోకేష్, రంగనాథ్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు. సోమందేపల్లి, (ఆంధ్రజ్యోతి): చిరంజీవి 70వ జన్మదిన వేడుకలను మండల కేంద్రంలోని షిర్డీనగర్‌లో అభిమానులు ఘనంగా నిర్వహించారు. కేక్‌కట్‌చేసి పంచిపెట్టారు. అనంతరం అభిమానులు మాట్లాడుతూ చిరంజీవి స్వయంకృషితో అంచెలంచెలుగా ఎదిగి ఉన్నతస్థాయికి చేరుకున్నారన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం: హెచ్‌ఎం

గోరంట్ల, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనంతో విజ్ఞానాన్ని సముపార్జించవచ్చని హెచ్‌ఎం ఈశ్వర్‌ప్రసాద్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని బాలుర ఉన్నతపాఠశాలలో హెచ్‌ఎం ఈశ్వర్‌ప్రసాద్ గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ- ఖాళీ సమయాన్ని వృథా చేయకుండా విద్యార్థులు పుస్తక పఠనం చేయాలని సూచించారు. ఉపాధ్యాయులు ఆ మేరకు విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు.



గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న హెచ్‌ఎం

రహదారి అధ్వానం

- వర్షం వస్తే కోట్లోపల్లి రోడ్డు బురదమయం
- గ్రామస్థులకు తప్పని ఇబ్బందులు



బురదమయంగా కోట్లోపల్లి-కొడికొండ చెక్‌పోస్టు రోడ్డు

చిలమత్తూరు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఆ గ్రామస్థులు ఎన్నో ఏళ్లుగా కనపడిన అధికారులకు, ప్రజాప్రతినిధులకు చెప్పుకుంటూనే ఉన్నారు. తమ గ్రామం నుంచి వేరే గ్రామానికి వెళ్లాలంటే ఉన్నది ఒక్కదారే, దానిని బాగుచేయించండని. అయినా ఏ అధికారి, ప్రజాప్రతినిధి స్పందించలేదని అంటున్నారు కోట్లపల్లి గ్రామస్థులు. ప్రమాదకరంగా ఉన్న దారిలోనే నిత్యం ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కోట్లోపల్లి నుంచి కొడికొండ చెక్‌పోస్టుకు వెళ్లే రోడ్డు ఇది. ఈ మార్గం ద్వారానే ఇతర గ్రామాల వారు కూడా నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఈ దారి కేవలం కోట్లోపల్లికే కాదు మరో పది గ్రామాలకు ఇప్పుడు రహదారిగా మారింది. ప్రయాణికులకు ప్రస్తుతం దగ్గరిదారిగా మారింది. కోట్లోపల్లి నుంచి కొడికొండ చెక్‌పోస్టుకి వెళ్లే ఈ దారి రెండు కిలోమీటర్లు ఉంది. అయితే చిన్నపాటి వర్షానికే చిత్తడై రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలిగిస్తోంది. 2014-19 కాలంలో అప్పటి టీడీపీ ప్రభుత్వమే ఈ దారిని తారురోడ్డుగా మార్చేందుకు సన్నాహాలు చేసింది. అయితే మట్టిపనులు మాత్రమే చేసి పనులు ఆపేశారు. అనంతరం వైసీపీ ప్రభుత్వం వచ్చినా భూమి పూజలు చేశారేగానీ పనులు చేపట్టిన పాపానపోలేదు. ఏళ్లు గడుస్తున్నా కోట్లోపల్లికి రోడ్డు సౌకర్యం కలగలేదు. వర్షాకాలం మొదలవగానే ఈ దారిలో ప్రయాణం నరకంగా మారుతోంది. కనీసం ద్విచక్రవాహనం కూడా వెళ్లలేని పరిస్థితి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

సమస్యల పరిష్కారానికే పల్లెబాట

ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పీఏ వీరయ్య



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పీఏ వీరయ్య

హిందూపురం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించేందుకే పల్లె బాట నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పీఏ వీరయ్య అన్నారు. శుక్రవారం హిందూపురం మండలంలోని బాలంపల్లిలో పల్లెబాట నిర్వహించారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ ప్రజలు సమస్యలు పరిష్కరించుకునేందుకు అధికారులవద్దకు కాకుండా అధికారులే ప్రజలవద్దకు వచ్చి పరిష్కరించడం జరుగుతుందన్నారు. కొన్ని సమస్యలు అక్కడికక్కడే పరిష్కరించగా మరికొన్ని సమస్యలకు గడువు కోరారు. ముఖ్యంగా పల్లెల్లో ఇంటి స్థలాలు, వీధి లైట్లు, రోడ్లు, కాలువల నిర్మాణంపైన ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో మండల కన్వీనర్‌రాము, అధికారులు ఎంపీడీఓ సరస్వతి, వివిధ శాఖల సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

పరిగి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రగాయాలపాలైన మాజీ ఎంపీటీసీ ఉప్పర నాగరత్నమ్మ కర్ణాటక రాష్ట్రం దొడ్డబళ్లాపురంలోని ఆస్పత్రిలో చికిత్సపొందుతూ శుక్రవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు ఎస్‌బీరేపల్లి గ్రామానికి చేరుకుని నివాళులు అర్పించారు. రూ.10వేల ఆర్థికసాయాన్ని ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు. పార్టీ అండగా ఉంటుందని, అధైర్యపడవద్దని సూచించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గోవిందరెడ్డి, సర్పంచ్ బాలాజీ, మాజీ ఎంపీటీసీ సోమప్ప, శాసనకోట వెంకటేశ్, విట్టాపల్లి నాగరాజు, తిరుమలేష్ పాల్గొన్నారు.

ఫ్రెండ్లీ షటిల్ టోర్నీ ప్రారంభం

గోరంట్ల, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఒత్తిడి నుంచి ఉపశమనం కోసం షటిల్ టోర్నీని నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్లు దామోదర్‌రెడ్డి, అశోక్, నాగరాజు, సిరాజుద్దీన్ పేర్కొన్నారు. పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఫ్రెండ్లీ షటిల్ టోర్నీని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్గనైజర్లు మాట్లాడుతూ పది టీంలు టోర్నీలో పాల్గొంటున్నాయన్నారు. విన్నర్స్ రన్నర్స్‌కు షీల్డులు, మెమొంటోలను పంచాయతీ కార్యదర్శి శంకర్ ఇవ్వనున్నారన్నారు. టర్నీ ప్రారంభంలో నరేంద్రరెడ్డి, వేమనారాయణ, ప్రసాద్, విజయానాయక్, రమణ, ఉపేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

పావగడ, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): తుమకూరు శ్రీదేవి ఆసుపత్రి, హెల్ప్ సొసైటీ సేవా సంస్థ మా ఆరోగ్య క్లీనిక్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్య శిబిరంలో ఈఎన్‌టీ వైద్యులు డాక్టర్ బిందు, జనరల్ వైద్యులు దివ్య, సమంత, ఆర్థోపెడిక్ వైద్యులు సుదీప్, కార్డియాలజిస్ట్ లిఖిత, చంద్ర, శ్వేత, గౌరీశంకర్, భరత్‌సింహ, దాదాపు 250 మందికి చికిత్సలు అందజేశారు.

నోటు పుస్తకాల పంపిణీ

గోరంట్ల, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని కె. రాగిమేకలపల్లి ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన గంగాధర్‌రెడ్డి శుక్రవారం నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఎంపీడీఓ నరేంద్రకుమార్ ఆధ్వర్యంలో పలకలు, నోటుపుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సురేష్, టెక్నికల్ అసిస్టెంట్ నరసింహులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

రొళ్ల, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ఎరువుల దుకాణాలను శుక్రవారం వ్యవసాయశాఖ అధికారి వెంకటబ్రహ్మాం, తహసీల్దార్ షెక్షావలి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బిల్లులు, రికార్డులను పరిశీలించారు. రైతులకు నాణ్యమైన, గుర్తింపు కలిగిన ఎరువులు అందించాలని నిర్వాహకులను ఆదేశించారు.

జయప్రదం చేయండి

హిందూపురం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): కడపలో జరిగే ఏఐఎస్ఎఫ్ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖరరెడ్డి కోరారు. శుక్రవారం బాలయేసు కళాశాలలో జాతీయ మహాసభ పోస్టర్లు విడుదల చేశారు. కార్యక్రమంలో గోపి, బానుప్రకాశ్, గోవింద్, పవన్, సిద్ధాంత పాల్గొన్నారు.